www.citytimesnews.com

# సిటీటైమ్స్

తెలుగు దినపత్రిక

Hyderabad | Adilabad | Rangareddy | Nalgonda | Medak | Mahaboobnagar | Karimnagar | Warangal | Khammam | Nizamabad

సంపుటి - 26 | సంచిక - 95 | హైదరాబాద్ | శనివారం | తేదీ:04.04.2026 | పేజీలు 8 | వెల రూ.3 | epaper.citytimesdaily.com

## సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఏసీబీ రైడ్

**వరంగల్, సిటీ టైమ్స్**

వరంగల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అవినీతి అక్రమాలపై అవినీతి నిరోధక శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సబ్ రిజిస్ట్రార్ల అక్రమ లావాదేవీలు, అనధికారిక వ్యక్తులతో వారు సాగిస్తున్న చీకటి ఒప్పందాలు వెలుగులోకి వచ్చాయి. సబ్ రిజిస్ట్రార్లయిన జమాల్పూర్ రామ్ నర్సింహారావు, దేవులూరి ఆనంద్ తమ కార్యాలయంలో ఇద్దరు వ్యక్తులను అనధికారికంగా డాక్యుమెంట్ రైటర్లుగా నియమించుకున్నట్లు ఏసీబీ గుర్తించింది.

2లో..

## ఇద్దరు పిల్లలతో భార్య ఆత్మహత్య

- భర్త రెండో పెళ్లి.. భార్యకు వేధింపులు
వరంగల్ జిల్లాలో ఘటన
- ఇద్దరు పిల్లలను ఇంటి ముందు పాతిపెట్టగా..
- భార్య మృతదేహాన్ని పొలంలో ఖననం

6లో..

## మీరు కేరళకు నేర్పాల్సింది ఏం లేదు

- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై సీఎం విజయన్ ఫైర్
- తప్పుడు సమాచారం ఆధారంగా
- నిరాధారణమైన ఆరోపణలు చేశారని ఆగ్రహం

2లో..

**తిరువనంతపురం, సిటీ టైమ్స్**

కేరళలో ఎన్నికల ప్రచారం కొనసాగుతోంది. నేతల మధ్య డైలాగ్ లు పేలుతున్నాయి. అయితే ఇటీవలే తెలంగాణ ముఖ్యమంత్రి కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించిన ప్రచారంలో మాట్లాడిన ఆయన___సీఎం పినరయి విజయన్ ను టార్గెట్ చేశారు.



## తెలంగాణకు నేను వ్యతిరేకం కాదు

- ఆ గౌరవాన్ని ఎప్పుడూ పోగొట్టుకోను!
- తెలంగాణ నా బ్రెయిన్ చైల్డ్
- ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలియచేస్తున్నా
- ఆ గౌరవాన్ని ఎప్పుడూ పోగొట్టుకోను

**అమరావతి, సిటీ టైమ్స్**

తెలంగాణకు తాను ఎప్పుడూ వ్యతిరేకం కాదని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు అన్నారు. విభజన జరిగినప్పుడు రెండు రాష్ట్రాల ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. రెండు రాష్ట్రాల ప్రజలకు న్యాయం చేసి విభజన చేయాలని కోరామని, రాజధాని లేకుండా ఏపీని విభజించారన్నారు. తెలుగుజాతి కోసం సైబరాబాద్, హైటెక్ సిటీ నిర్మించామన్నారు. పోలవరం ముంపు మండలాలను ఏపీలో కలిపితేనే తాను ప్రమాణం చేస్తానని చెప్పానని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. అమరావతికి చట్టబద్ధత బిల్లు ఆమోదించినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. పుష్కరకాలం కింద అమరావతిని రాజధానిగా నిర్ణయించామని, అది ఇప్పుడు చట్టబద్ధత పొందిందని సీఎం పేర్కొన్నారు.

2లో..



## దక్షిణాసియాలో తెలంగాణ టెక్స్‌టైల్స్ క్యాపిటల్

పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలి సీఎం రేవంత్‌రెడ్డి

- ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్ కు హాజరు
- 'ఉత్తమ వస్త్రాల రూపకల్పనలో
- భారత్‌కు గొప్ప చరిత్ర ఉంది
- అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ
- పెట్టుబడిదారులకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం

9లో..



**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తెలంగాణ రైజింగ్‌లో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. "ఉత్తమ వస్త్రాల రూపకల్పనలో భారత్‌కు గొప్ప చరిత్ర ఉంది. అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతోంది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా లక్ష్యం. పెట్టుబడిదారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం. టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు.. చేనేతలకు జీవితం. దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం. ప్రపంచంలోనే ఫిల్మ్ ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ మారింది.

## టీఆర్ఎస్.. ఆ పేరు ఇప్పుడు ఎవరైనా వాడుకోవచ్చు

- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు
- భారంగా ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు

6లో..

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఫ్రీ అయిందని.. ఇప్పుడు దాన్ని ఎవరైనా వాడుకోవచ్చన్నారు. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి బిహార్ సిద్ధాంతకర్త అంటూ ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు.

**తలకు మించిన భారంగా ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు**

రాష్ట్రంలో ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు 30 నుంచి 40 శాతం ఫీజులు పెంచడం మధ్య తరగతి తల్లితండ్రులకు తలకు మించిన భారంగా మారుతోందని కవిత అన్నారు. అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న స్కూల్ యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని.. అధిక ఫీజుల వసూళ్లను కట్టడి చేయాలని కోరారు.



## మౌనంగా ఉన్నా.. కానీ ఓడిపోలేదు

- పదవి పోయాక రాఘవ్ చద్దా
- సోషల్ మీడియాలో రాఘవ్ చద్దా ఆవేదన
- నా మౌనాన్ని ఓటమిగా పొరపాటు పడకండి అని ట్వీట్

7లో..

## మళ్లీ అక్కడే కట్టిస్తా

- 20 ఏళ్ల కిందట తొలగించిన గుడి
- జగ్గారెడ్డి సంచలన ప్రకటన
- రహదారి పనులలో భాగంగా తొలగింపు
- సంగారెడ్డి చౌరస్తాలోని భూలక్ష్మమ్మ గుడి

7లో..

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. జాతీయ రహదారి విస్తరణ పనులలో భాగంగా సంగారెడ్డిలో 20 ఏళ్ల క్రితం తొలగించిన ఓ గుడిని.. రాబోయే రోజులలో మళ్లీ అదేచోట ఏర్పాటు చేయించాలని జగ్గారెడ్డి (తూర్పు జయప్రకాష్ రెడ్డి) నిర్ణయించారు. గతంలో జాతీయ రహదారి విస్తరణ పనులలో భాగంగా తొలగించిన భూ లక్ష్మమ్మ గుడిని.. తిరిగి రోడ్డు పక్కనే గతంలో వున్న చోటే భవిష్యత్తులో ఏర్పాటు చేయించనున్నట్లు ఈ మేరకు ప్రకటించారు.

## ఏ ఒక్క హామీ నెరవేర్చలే



**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కేవలం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని మాజీ మంత్రి హరీష్ రావు స్పష్టం చేశారు. నారాయణపేట జిల్లా కొత్తపల్లిలో బావోజీ మహారాజ్‌ను దర్శించుకున్న ఆయన, అనంతరం గిరిజన సోదరులను ఉద్దేశించి ప్రసంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. గిరిజనులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ప్రస్తుత ప్రభుత్వం నెరవేర్చలేదని ఆయన ఆరోపించారు.

- గిరిజనులను కాంగ్రెస్ మోసం చేసింది
- మాజీ మంత్రి హరీశ్ ఫైర్
- డెడ్ స్టోరేజీకి చేరిన జూరాల ప్రాజెక్టు
- కోయిల్ సాగర్ ఆయకట్టుకు నీటి కష్టాలు తీవ్రం
- నారాయణపూర్ నుంచి నీటి విడుదలకు ప్రభుత్వ ప్రయత్నాలు

2లో..

## భారత్ బెదిరిస్తోంది

- దాడులు చేసే అవకాశం ఉంది
- ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్య
- దుస్సాహసానికి పాల్పడితే..
- ఊహించని రీతిలో దాడులు

7లో..

## వీళ్ల పరిపాలన.. వీళ్లూ పాడుగాను

- బీపీ లేస్తోంది. తిట్టలేకున్నా
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

2లో..

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మీద మిత్రపక్షం సీపీఐ ఎమ్మెల్యే విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రభుత్వాన్ని ఉద్దేశించి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. కొత్తగూడెం బస్టాండులో ఇటీవల ప్రజాపాలన - ప్రగతి నివేదిక 99 రోజులు పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు.



## అన్నామలైకు షాక్

- తమిళనాడు ఎన్నికలకు
- 27 మందితో అభ్యర్థుల జాబితా
- మాజీ గవర్నర్ తమిళిసైకు టికెట్

6లో..

**చెన్నై, సిటీ టైమ్స్**

సీట్ల సర్దుబాటుపై మిత్రపక్షాలతో కొనసాగుతున్న చర్చలు, రాజకీయ వ్యూహాల నడుమ తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ తన అభ్యర్థుల జాబితాను శుక్రవారం ప్రకటించింది. న్యూఢిల్లీలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయం మొత్తం 27 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను విడుదల చేయగా.. సీట్లు దక్కించుకున్నవారిలో పలువురు ప్రముఖులు ఉన్నారు. రాష్ట్రంలో తమ ఉనికిని బలోపేతం చేసుకోవాలన్న బీజేపీ ఉద్దేశాన్ని ఇది సూచిస్తోంది. బీజేపీకి అన్నాడీఎంకే 27 సీట్లను కేటాయించిన సంగతి తెలిసిందే.



# మీరు కేరళకు నేర్పాల్సింది ఏం లేదు

**తిరువనంతపురం, సిటీ టైమ్స్**

కేరళలో ఎన్నికల ప్రచారం కొనసాగుతోంది. నేతల మధ్య డైలాగ్ లు పేలుతున్నాయి. అయితే ఇటీవలే తెలంగాణ ముఖ్యమంత్రి కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించిన ప్రచారంలో మాట్లాడిన ఆయన... సీఎం పినరయి విజయన్ ను టార్గెట్ చేశారు.కేరళను మోదీ బ్రదర్స్ పాలిస్తున్నారంటూ కూడా మాట్లాడారు. పదేండ్ల పాటు అధికారంలో ఉన్న పినరయి విజయన్ కు... తెలంగాణను పదేండ్ల పాటు పాలించిన కేసీఆర్ మధ్య అనేక పోలికలు ఉన్నాయని వ్యాఖ్యానిచరారు. అవినీతి, అసమర్థ, కుటుంబ పాలన విషయంలో వారిద్దరూ ఒక్కటేనంటూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

ఇక కేరళ ఎన్నికల ప్రచారంలో భాగంగా రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సీఎం పినరయి విజయన్ తీవ్రస్థాయిలో స్పందించారు. రేవంత్ రెడ్డి కేరళ రాష్ట్రం గురించి ఇటీవల చేసిన అవమానకర వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవన్నారు. తన సొంత రాష్ట్రంలో పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపే వ్యక్తి.... కేరళకు సామాజిక ప్రగతి గురించి నీతులు చెప్పడానికి ప్రయత్నించడం విడ్డూరమని దుయ్యబట్టారు. సుస్థిర, సమ్మిళిత అభివృద్ధి నమూనాను దెబ్బతీయాలని చూస్తున్న వారికి ఆయన కేవలం ఒక గొంతుకగా మారిపోయారని కౌంటర్ ఇచ్చారు.

**రేవంత్ రెడ్డికి విజయన్ సూటి ప్రశ్నలు...**

"కేరళలో అవినీతి ఆరోపణలు చేసే ముందు... ఆయన అధికారిక గణాంకాలను పరిశీలించాలి. భారతదేశంలోనే అత్యంత తక్కువ అవినీతి ఉన్న రాష్ట్రం కేరళ అని ఆయన గమనించలేదా...? నీతి ఆయోగ్ ఎస్డీజీ సూచిక (202324)లో కేరళ 79 పాయింట్లతో మొదటి స్థానంలో నిలవగా, తెలంగాణ 6వ స్థానంలో ఉంది. మీ సొంత రాష్ట్ర లోపాలను కప్పిపుచ్చుకోవడానికి కేరళను ఎగతాళి చేయడం అత్యంత విచారకరం" అని పినరయి విజయన్ చెప్పారు.

"నీతి ఆయోగ్ ప్రకారం... కేరళలో పేదరికం రేటు కేవలం 0.55%, ఇది భారతదేశంలోనే అత్యల్పం. 2025 చివరి నాటికి, దేశంలో తీవ్ర పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించిన మొదటి రాష్ట్రంగా కేరళ నిలవనుంది. మరోవైపు, తెలంగాణలో పేదరికం రేటు 5.88%గా ఉంది. కేరళ 95.3% అక్షరాస్యత రేటుతో అగ్రస్థానంలో ఉండగా, తెలంగాణ ఇప్పటికీ 76.9%తో వెనుకబడి ఉంది"

కాంగ్రెస్‌కు పరోక్షంగా సహాయపడటానికి కేరళలో రాజకీయ ప్రకటనలపై కోట్లు ఖర్చు పెట్టే బదులు... ఆయన తన సొంత గడ్డ(తెలంగాణ)లో పేదరికాన్ని నిర్మూలించడం, అక్షరాస్యతను మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలి కదా...? కేరళ శిశు మరణాల రేటు (IMR) 5కి తగ్గింది. అమెరికాలోని 5.6 కన్నా కూడా ఇది మెరుగైనది. తెలంగాణలో IMR దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ. మన పటిష్టమైన ప్రజారోగ్య వ్యవస్థ కారణంగా.... ఒక మలయాళీ సగటు భారతీయుడి కంటే 57 సంవత్సరాలు ఎక్కువ కాలం జీవిస్తున్నాడు. 2025 సెప్టెంబర్ 16న తెలంగాణ నుంచి రెవెన్యూ, సర్వే అధికారుల ఉన్నత స్థాయి బృందం కేరళ యొక్క ప్రతిష్టాత్మక డిజిటల్ భూ రికార్డుల వ్యవస్థను అధ్యయనం చేయడానికి తిరువనంతపురాన్ని సందర్శించింది. కానీ కేరళ పాలన నమూనాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా ఎగతాళి చేయడం ఏంటి..?

కేరళ, కేంద్ర ప్రభుత్వాల మధ్య 'సంబంధం' ఉందన్న ఆయన వాదన హాస్యాస్పదమైనది. కేరళ అభివృద్ధిని అడ్డుకుంటున్న కేంద్రం యొక్క ఆర్థిక దిగ్బంధనాలకు... రుణ పరిమితుల కోతలకు వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడకుండా, బీజేపీకి అసలైన బి టీమ్‌గా వ్యవహరిస్తున్నది వెన్నుముక లేని కాంగ్రెస్ పార్టీనే. ఈ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా కేరళలో జరుగుతున్న తీవ్ర నిరసనలను ఆయన గమనించలేదా...? లేక మన రాష్ట్రానికి తన పార్టీ చేసిన ద్రోహాన్ని ఆయన కేవలం సమర్థిస్తున్నారా...?

జీతాలు, పెన్షన్లను పదేపదే ఆలస్యం చేసే ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.... కేరళకు నేర్పాల్సింది ఏమీ లేదు. ఖజానాలు మూసివేయబడి, సంక్షేమ పెన్షన్లు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న యూడీఎఫ్ శకం గతం. పరిపాలన, ప్రజా సంక్షేమం యొక్క నిజమైన పాఠాలు నేర్చుకోవడానికి తెలంగాణ ముఖ్యమంత్రికి కేరళ తరపున మేము వినమ్రపూర్వకంగా స్వాగతం పలుకుతున్నాం" అంటూ విజయన్ హితవు పలికారు.



# సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఏసీబీ రైడ్

**- ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల అక్రమ సంపదలు బట్టబయలు**

**వరంగల్, సిటీ టైమ్స్**

వరంగల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అవినీతి అక్రమాలపై అవినీతి నిరోధక శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సబ్ రిజిస్ట్రార్ల అక్రమ లావాదేవీలు, అనధికారిక వ్యక్తులతో వారు సాగిస్తున్న చీకటి ఒప్పందాలు వెలుగులోకి వచ్చాయి. సబ్ రిజిస్ట్రార్లయిన జమాల్పూర్ రామ్ నర్సింహారావు, దేవులూరి ఆనంద్ తమ కార్యాలయంలో ఇద్దరు వ్యక్తులను అనధికారికంగా డాక్యుమెంట్ రైటర్లుగా నియమించుకున్నట్లు ఏసీబీ గుర్తించింది. వీరిద్దరూ డాక్యుమెంట్ రైటర్లతో కలిసి రిజిస్ట్రేషన్ల పేరుతో భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు.

కేవలం ఈ అనధికారిక రైటర్లు పంపిన పత్రాలను మాత్రమే సబ్ రిజిస్ట్రార్లు ప్రాధాన్యత ఇచ్చి రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తేలింది. కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పూర్తి కాని సుమారు 70 డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్లు, డాక్యుమెంట్ రైటర్ల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు వాట్సాప్ చాట్ ద్వారా బట్టబయలయ్యాయి. గత ఏడాది కాలంలోనే డాక్యుమెంట్ రైటర్ల ద్వారా ఈ ఇద్దరు అధికారులు సుమారు రూ. 42 లక్షలను లంచంగా తీసుకున్నట్లు ఏసీబీ ఆధారాలు సేకరించింది.

కార్యాలయంలో సోదాల అనంతరం ఏసీబీ బృందాలు ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల నివాసాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టాయి. వీరి ఇళ్లలో లక్షలాది రూపాయల నగదుతో పాటు భారీగా అక్రమ ఆస్తులకు సంబంధించిన పత్రాలను అధికారులు కనుగొన్నారు. ఇక్కడ ఓ షాకింగ్ అంశం వెలుగులోకి వచ్చింది. ఓ అధికారి ఇంట్లో రిజిస్ట్రేషన్ చేయని 254 ప్రభుత్వ పత్రాలు లభించడం అధికారులను సైతం విస్మయానికి గురిచేసింది. ప్రభుత్వ కార్యాలయంలో ఉండాల్సిన పత్రాలు అధికారుల ఇళ్లలో ఎందుకు ఉన్నాయనే కోణంలో ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఈ ఇద్దరు అధికారులపై ఏసీబీ కేసులు నమోదు చేసింది. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న నగదు, డాక్యుమెంట్లు, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తున్నారు.




# తెలంగాణకు నేను వ్యతిరేకం కాదు

**అమరావతి, సిటీ టైమ్స్**

తెలంగాణకు తాను ఎప్పుడూ వ్యతిరేకం కాదని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు అన్నారు. విభజన జరిగినప్పుడు రెండు రాష్ట్రాల ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. రెండు రాష్ట్రాల ప్రజలకు న్యాయం చేసి విభజన చేయాలని కోరామని, రాజధాని లేకుండా ఏపీని విభజించారన్నారు. తెలుగుజాతి కోసం సైబరాబాద్, హైటెక్ సిటీ నిర్మించామన్నారు. పోలవరం ముంపు మండలాలను ఏపీలో కలిపితేనే తాను ప్రమాణం చేస్తానని చెప్పానని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. అమరావతికి చట్టబద్ధత బిల్లు ఆమోదించినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. పుష్కరకాలం కింద అమరావతిని రాజధానిగా నిర్ణయించామని, అది ఇప్పుడు చట్టబద్ధత పొందిందని సీఎం పేర్కొన్నారు.

ఉండవల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. 'చాలా సంతోషంగా ఉంది. రాష్ట్ర ప్రజలకి ఒక సందేశాన్ని ఇవ్వడానికి ఈ కార్యక్రమం పెట్టాను. అమరావతిని చట్టం చేసి 12సంవత్సరాలు అయ్యింది. రాజధానిగా అమరావతిని పార్లమెంట్ ఆమోదించడం ప్రజా విజయంగా భావిస్తున్నా. పార్లమెంట్లో 10 పార్టీలు మద్దతు ఇచ్చాయి. మిగిలిన పార్టీలు పరోక్షంగా మద్దతు పలికారు. లోక్ సభలో 41 పార్టీలు ఉన్నాయి. 9 పార్టీలు రాజ్యసభలో ఉన్నాయి. అన్ని కలిపి 50 పార్టీలు. నేరుగా చాలా మంది సహకరించారు. ఒకే ఒక్క పార్టీ వైసీపీ మాత్రం ఈ రాష్ట్రానికి ద్రోహం చేసే ప్రయత్నం చేసింది. 2024 జూన్ 2 నుంచి అమరావతి రాజధానిగా శాశ్వతంగా ఉంటుంది. రాష్ట్రపతి ఆమోద ముద్రతో చట్టంగా వస్తుంది. ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలియచేస్తున్నా. ప్రధాని అన్ని విధాలుగా సహకరించారు' అని సీఎం చెప్పారు.

'అమరావతి రాజధానిగా ఉండాలని దేశ ప్రయోజనాల కోసం చాలా పార్టీలు ఆలోచించాయి. కానీ వైసీపీ మాత్రం అమరావతిని నాశనం చేయాలని చూసారు. కుట్ర దాటి అమరావతి గెలిచింది. ప్రజల ఆశలు, ఆశయాలు నెరవేరిన సందర్భం ఇది. భవిష్యత్లో ఎవరు ఏమి చెయలేని విధంగా జరిగింది. రెండు ప్రాంతాలు సమన్వయం చేయాలనీ ఆనాడు తెలియచేసా. పరిష్కారం కాకుండా విభజన జరిగింది. పోలవరం ఒక సంకల్పం. ఒక 7 మండలాలు తెలంగాణాలో కలిపారు. కానీ ఆనాడు 7 మండలాలు ఏపీకి ఇవ్వాలని ప్రధాని మోడీని కోరాను. నేనెప్పుడూ తెలంగాణాకి వ్యతిరేకిని కాదు. విభజిత ఏపీలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇరిగేషన్ కార్యాలయానికి బస్సులో బస చేశా. శివరామక్రిష్ణ కమిటీ రాష్ట్ర రాజధాని కోసం తిరగడం జరిగింది. గుంటూరు విజయవాడ రాజధాని అయితే సిఫార్సు చేసారు. అప్పుడు వైసీపీ నాయకులూ విన్యాసాలు వేసి అందరిని రెచ్చగొట్టారు. అధికార వికేంద్రికరణ చేస్తూనే భవిష్యత్ కోసం ఒక సంకల్పం చేసాము. రెండు ప్రాంతాలకి సమాన దూరం ఉండేలా ఒక ప్రదేశాన్ని ఎంపిక చేసాము' అని సీఎం తెలిపారు.

'వైసీపీ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించింది. అమరావతి నాశనం అయినా పర్వాలేదని వైసీపీ నేతలు అనుకున్నారు. కానీ మనం 'శాసనం' చేసుకున్నాం. కేంద్ర ప్రభుత్వ రాజముద్రతో 5 కోట్ల ఆంధ్రుల ఆశలు, ఆశయాలు నెరవేరాయి. అమరావతిని ఇక భవిష్యత్తులో ఎవరూ ఏమీ చేయలేరు. విభజన సమయంలో రెండు రాష్ట్రాల్లోనూ భావోద్వేగాలు ఉన్నాయి. తెలుగు జాతి ప్రయోజనాల కోసం సంపద సృష్టికి ఓ ప్రాంతం తయారుకావాలనే హైదరాబాద్లో సైబరాబాద్ నిర్మాణం చేశాం. రెండు ప్రాంతాలకూ సమన్యాయం చేయాలని ఆ రోజు చెప్పాం. చాలా అంశాలు పరిష్కారం కాకున్నా విభజన జరిగింది. ఆర్థిక కష్టాలు, రాజధాని లేదు, వనరులు లేవు అన్నీ ఇబ్బందులే. అప్పాయింటెడ్ డే జూన్ 2 కంటే ముందే తెలంగాణలో ఉన్న 7 పోలవరం ముంపు మండలాలు ఏపీలో కలపాలని కోరాను. తెలంగాణాకు నష్టం కలగాలని ఎప్పుడూ కోరుకోను. ఇవాళ హైదరాబాద్లో ఇంతటి సంపద కలిగిందంటే సైబరాబాద్ లాంటి నగరాల నిర్మాణమే. చాలా మంది ఎంపీలు గుర్తించి పార్లమెంటులోనూ ఇది ప్రస్తావించారు. ఆ గౌరవాన్ని ఎప్పుడూ పోగొట్టుకోను. రాజధాని లేకుండా విజయవాడకు వచ్చాం. ఒక ఎస్ఈ కార్యాలయంలో ఆఫీసు ఏర్పాటు చేసుకుని, బస్సులో బస చేసి కార్యకలాపాలు ప్రారంభించాం. ఏమీ లేకుండా రాష్ట్రం ఏర్పడిందనటానికి అవే ప్రత్యక్ష ఉదాహరణ. శివరామకృష్ణన్ కమిటీని కేంద్రం ఏర్పాటు చేస్తే 46 శాతం మంది ప్రజలు విజయవాడగుంటూరు మధ్య రాజధానికి ఏర్పాటుకు అనుకూలమని పేర్కొన్నారు. అయితే వైసీపీ చాలా డ్రామాలు ఆడింది. అధికార వికేంద్రీకరణ చేస్తూనే మనకంటూ ఓ రాజధాని ఉండాలని మేం సంకల్పం చేశాం. ఆ సంకల్పంలో భాగమే మూడు ప్రాంతాలకు సమాన దూరంలో ప్రాంతాన్ని రాజధానిగా ఎంపిక చేశాం. రాష్ట్రం మధ్యలో ఉన్న ప్రాంతంగా, కనెక్టివిటీ పరంగా, భౌగోళికంగా, చారిత్రాత్మక ప్రదేశంగా రాజధానిగా ఎంపిక చేసి ప్రణాళికలు చేశాం' అని సీఎం చెప్పుకొచ్చారు.



# ఏ ఒక్క హామీ నెరవేర్చలే

**- కర్ణాటకతో చర్చలు.. 5 టీఎంసీల కోసం విజ్ఞప్తి**

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కేవలం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని మాజీ మంత్రి హరీష్‌రావు స్పష్టం చేశారు. నారాయణపేట జిల్లా కొత్తపల్లిలో బావోజీ మహారాజ్‌ను దర్శించుకున్న ఆయన, అనంతరం గిరిజన సోదరులను ఉద్దేశించి ప్రసంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. గిరిజనులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ప్రస్తుత ప్రభుత్వం నెరవేర్చలేదని ఆయన ఆరోపించారు.

దశాబ్దాల కాలంగా గిరిజనులు కలలుగన్న "మా తండాలో మా రాజ్యం" నినాదాన్ని నిజం చేసింది కేసీఆర్ మాత్రమేనని హరీష్‌రావు గుర్తు చేశారు. గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు పట్టించుకోని 3,100 గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత బీఆర్ఎస్‌దేనని ఆయన పేర్కొన్నారు. అలాగే, విద్య , ఉద్యోగాల్లో గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుండి 10 శాతానికి పెంచడం వల్ల నేడు వేలాది మంది గిరిజన బిడ్డలు డాక్టర్లు, ఇంజనీర్లుగా ఉన్నత పదవుల్లో స్థిరపడుతున్నారని ఆయన వివరించారు.

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా రాష్ట్ర పండుగగా ప్రకటించి, నిధులు కేటాయించి ఊరూరా ఘనంగా నిర్వహించేలా చేసింది తమ ప్రభుత్వమేనని హరీష్ రావు గర్వంగా చెప్పారు. కొత్తపల్లి ప్రాంతంలో రూ. 8 కోట్లతో బ్రిడ్జిని నిర్మించడంతో పాటు, రూ. 50 లక్షలతో బంజారా భవనాన్ని, బావోజీ మహారాజ్ దేవాలయ అభివృద్ధికి రూ. 80 లక్షల నిధులను మంజూరు చేయించినట్లు ఆయన గుర్తు చేశారు.

పోడు భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి కేసీఆర్ 6 లక్షల ఎకరాలకు పట్టాలు పంపిణీ చేయడమే కాకుండా, వారికి రైతుబంధు, రైతుబీమా వంటి సౌకర్యాలను కల్పించారని హరీష్ రావు తెలిపారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో లంబాడాలకు కనీసం మంత్రి పదవి కూడా లేదని, గిరిజనులను కేవలం ఓట్ల కోసమే వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధిని కాంగ్రెస్ గాలికొదిలేసిందని, ఇచ్చిన హామీలన్నీ బుట్టదాఖలు అయ్యాయని ఆయన మండిపడ్డారు.



# వీళ్ల పరిపాలన.. వీళ్లూ పాడుగాను

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మీద మిత్రపక్షం సీపీఐ ఎమ్మెల్యే విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రభుత్వాన్ని ఉద్దేశించి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. కొత్తగూడెం బస్టాండులో ఇటీవల ప్రజాపాలన ప్రగతి నివేదిక 99 రోజులు పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన కూనంనేని.. ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామంటూ.. బస్సులు, బస్టాండ్ల నిర్వహణను పట్టించుకోకుండా గాలికొదిలేస్తే ఎలా అని నిలదీశారు. ఈ క్రమంలోనే 'వీళ్ల పరిపాలన.. వీళ్లు పాడు గాను.. బీపీ లేస్తోంది. తిట్టలేక ఈ మాట అంటున్నా' అని కూనంనేని విమర్శించారు. తెలివి, పట్టుదల, దీక్ష ఉండాలని.. కానీ వీళ్లకు అవి లేవంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మిత్రపక్షానికి చెందిన ఎమ్మెల్యే విమర్శించటం ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది.

రాష్ట్రంలో 143 బస్టాండులు ఉన్నాయన్న కూనంనేని.. బస్టాండ్‌కు రూ.5 కోట్లు లెక్కన కేటాయించినా రూ.700 కోట్లకు మించదని అన్నారు. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వానికి రూ.700 కోట్లు పెద్ద సమస్య అవుతుందా అని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే వీళ్ల పరిపాలన.. వీళ్లు పాడుగానూ.. అంటూ కూనంనేని సాంబశివరావు తన అసహనం వ్యక్తం చేశారు. ఇక ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనూ కూనంనేని సాంబశివరావు ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మిత్రపక్షంగా ఉన్నందున గట్టిగా మాట్లాడలేకపోతున్నామని.. తిట్టలేని, విమర్శించలేని స్థితిలో ఉన్నామన్నారు కూనంనేని. మౌనంగా ఉంటే అసమర్థుల కింద చూస్తున్నారని మండిపడ్డారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులున్నా.. తమకు మాత్రం నిధులు రావటం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

మరోవైపు పొరుగు రాష్ట్రంలో కేరళంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాల్గొంటున్నారు. కాంగ్రెస్ కూటమి తరుపున ప్రచారం చేస్తున్న రేవంత్ రెడ్డి.. అధికార కమ్యూనిస్ట్ పార్టీ కూటమిపై విమర్శలు గుప్పిస్తున్నారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను టార్గెట్‌గా చేసుకుని ఎన్నికల ప్రచార సభలలో విమర్శలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణలో కాంగ్రెస్ మిత్రపక్షమైన సీపీఐ ఎమ్మెల్యే.. ప్రభుత్వ తీరుపై విమర్శలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కేరళ రాష్ట్ర రాజకీయాల ఎఫెక్ట్ తెలంగాణలో మిత్రభేదం కలిగిస్తున్నాయా అనే విశ్లేషణలు మొదలయ్యాయి.



# పబ్ పార్టీలు... మత్తుకు అడ్డాలా?

- ఈగల్ దాడులతో డ్రగ్స్ పార్టీ గుట్టు రట్టు
- గుట్టు చప్పుడు లేకుండా సాగుతున్నవి ఇంకా ఎన్నో?
- కొండాపూర్ క్వేక్ అరినా పబ్‌లో అర్ధరాత్రి దాడులు
- 64 మందికి డ్రగ్స్ పరీక్షలు... 8మందికి డ్రగ్స్ పాజిటివ్
- గంజాయి, మెథాంఫేటమిన్, బెంజోడియాజెపైన్ వినియోగం నిర్ధారణ
- ప్రముఖుల కుటుంబాలకు చెందిన వ్యక్తులపై అనుమానాలు




**శేరిలింగంపల్లి, ఏప్రిల్3 (సిటీటైమ్స్):**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఐటి కారిడార్ లో పబ్ కల్చర్ మాటున నిషేధిత డ్రగ్స్ పార్టీలు గుట్టుచప్పుడు లేకుండా నిర్వహిస్తున్న ఆరోపణలపై ఈగల్ టీమ్ దృష్టిసారించింది. శుక్రవారం హైటెక్ హబ్ సైబరాబాద్‌లో పబ్ పార్టీలు మత్తు కేంద్రాలుగా మారుతున్నాయన్న అనుమానాలను బలపరిచే ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌లోని క్వేక్ అరినా పబ్‌పై ఈగల్ దాడుల్లో 64 మందికి డ్రగ్ పరీక్షలు నిర్వహించగా, 8 మందికి పాజిటివ్‌గా తేలింది. గంజాయి, మెథాంఫేటమిన్, బెంజోడియాజెపైన్ వినియోగం నిర్ధారణ అయింది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండాపూర్ 'క్వేక్ అరినా పబ్'లో అర్ధరాత్రి ఈగల్ ఫోర్స్, సైబరాబాద్ నార్కోటిక్స్ పోలీసులు, గచ్చిబౌలి పోలీసులు సంయుక్తంగా దాడులు చేపట్టారు. అంతర్జాతీయ డీజే 'బ్లాక్ కాఫీ' ఈవెంట్ పేరుతో జరుగుతున్న పార్టీపై వచ్చిన విశ్వసనీయ సమాచారంతో ఆరు బృందాలు సమన్వయంతో ఆపరేషన్ నిర్వహించాయి. ముందస్తు ఇంటెలిజెన్స్ ఆధారంగా 64 మందిని గుర్తించి కార్యక్రమానికి అంతరాయం కలగకుండా తనిఖీలు చేపట్టారు. ఎబాన్ యూరిన్ డ్రగ్ టెస్ట్ కిట్లతో పరీక్షలు నిర్వహించగా 8 మందికి డ్రగ్స్ పాజిటివ్‌గా తేలింది. గంజాయి, బెంజోడియాజెపైన్, మెథాంఫేటమిన్ వినియోగం నిర్ధారణ అయింది. డ్రగ్స్ వినియోగాన్ని నిందితులు అంగీకరించినట్లు అధికారులు పేర్కొన్నారు. పట్టుబడిన వారిని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించి క్రైమ్ నంబర్ 591/2026కింద ఎన్‌డీపీఎస్ చట్టం 1985 సెక్షన్ 8(సి), 27(ఎ), 27(బి)ల ప్రకారం కేసులు నమోదు చేశారు. వ్యాపారవేత్తలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఏపీకి చెందిన ఓ మహిళా ఐఏఎస్ అధికారికి చెందిన కుటుంబ సభ్యుడు కూడా ఉన్నట్టు సమాచారం చర్చనీయాంశంగా మారింది. స్పెయిన్‌కు చెందిన విదేశీ కళాకారుడు అలెగ్జాండర్, పబ్ డీజే కేవీలకు నిర్వహించిన పరీక్షల్లో నెగటివ్ రిపోర్ట్ వచ్చినట్లు అధికారులు స్పష్టం చేశారు.

**వేడుకలు అంటేనే మత్తు సంప్రదాయమా?**

ఐటీ కారిడార్‌లో పెరుగుతున్న నైట్ పార్టీలు డ్రగ్స్ వినియోగానికి వేదికగా మారాయి అనే అనుమానాలు బలపడుతున్నాయి. ఫాస్ట్ లైఫ్‌స్టైల్, ఒత్తిడి, సులభ లభ్యత యువతను ప్రమాదకర దారిలో నెడుతున్నాయని, జన్మదిన వివాహ వార్షికోత్సవ వేడుకలు సైతం మత్తు సంప్రదాయాలుగా మారుతున్నాయని ప్రస్తుత ఘటన నిదర్శనంగా చెప్పవచ్చు అంటున్నారు సామాజిక వేత్తలు.

**డ్రగ్స్ నెట్‌వర్క్‌పై ఈగల్ ఫోకస్**

డ్రగ్స్ సరఫరా గొలుసుపై దర్యాప్తు ముమ్మరం చేశారు. సరఫరా మార్గాలు, మధ్యవర్తులపై ఈగల్ దృష్టి సారించింది. విశ్వసనీయ సమాచారంతో పబ్ పార్టీలు జరిగే చోట ఈగల్ టీమ్ దాడులు చేస్తూ డ్రగ్స్ ముఠాలు నెట్వర్క్ గుట్టురట్టు చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని అధికారులు స్పష్టం చేశారు.

**ప్రజలకు విజ్ఞప్తి**

డ్రగ్స్‌పై సమాచారం ఉంటే 1908 లేదా 8712671111కు తెలియజేయాలని ఈగల్ టీమ్ అధికారులు నగర ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. సమాచారం గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేసింది. పబ్‌లపై దాడులు కొనసాగుతున్నా మత్తు ముసురు తగ్గుతుందా...? లేక హైటెక్ హబ్‌ను కమ్మేస్తుందా అన్న ప్రశ్నలు గట్టిగా వినిపిస్తున్నాయి.



## కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా శివాగౌడ్

- శుభాకాంక్షలు తెలిపిన శేరిలింగంపల్లి బిజెపి బిజెవైఎం నాయకులు

**శేరిలింగంపల్లి, ఏప్రిల్3(సిటీటైమ్స్):**

కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సంయుక్త కార్యదర్శిగా ఘన విజయం సాధించిన శివా గౌడ్ కి శేరిలింగంపల్లి అసెంబ్లీ బీజేపీ ,బీజేవైఎం నాయకులు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు టిఎసి మెంబర్ పోరెడ్డి బుచ్చిరెడ్డి , మారం వెంకటేశ్వర్లు , గొల్లపల్లి రాంరెడ్డి , చందా నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస్ రెడ్డి, హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్, బీజేపీ నాయకులు శివ యాదవ్ , బీజేపీ యువ మోర్చా నాయకులు నవీన్ రెడ్డి , మనోజ్ ముదిరాజ్ , కిరణ్ , సాయి పటేల్ , అచ్యుత్ రెడ్డి , లోకేష్ , రాజు గౌడ్ , సంతోష్ , విజయ్, పరమేశ్ , గోపాల్ , ఇతరులు పాల్గొన్నారు.

## జిల్లా నూతన డిసిసి ఉపాధ్యక్షుడిగా కూన శ్రీనివాస్ గౌడ్



**శుభాకాంక్షలు తెలిపిన కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ శ్రేణులు**

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్3(సిటీటైమ్స్):**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నూతన డిసిసి ఉపాధ్యక్షుడిగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూన శ్రీనివాస్ గౌడ్ నియామకంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పలు కాలనీ బస్తి వాసులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కూన శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు వివిధ బస్తీల నుండి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు షాపూర్ నగర్ లోని వారి నివాసానికి వచ్చి శ్రీనివాస్ గౌడ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించిన పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ కి కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పటిష్టతకు కృషి చేస్తూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ విషయమై ఎంపీతో ప్రణవ్ బాబు భేటీ

- సీఎం దృష్టికి తీసుకువెళ్లండి
- సమస్యను పరిష్కరించండి
- ప్రజా ఉద్యమాలకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు
- కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రణవ్ వెల్లడి

**హుజురాబాద్ ఏప్రిల్ 4**
**సిటీ టైమ్స్ ప్రతినిధి**



హుజురాబాద్ నియోజకవర్గ నడిబొడ్డున ఏర్పాటు చేయ తలపెట్టిన ప్రాణాంతకమైన డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకునే విధంగా ఒత్తిడి చేయాలని కోరుతూ ప్రభుత్వ సలహాదారు... రాజ్యసభ సభ్యులైన వేం నరేందర్ రెడ్డి ని కలిసి విజ్ఞప్తి చేసినట్లు హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రణవ్ బాబు వెల్లడించారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటును కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తున్నదని... హుజురాబాద్ పాత తాలూకా ప్రజల ఆకాంక్షలు తమకు ముఖ్యమని... ప్రజలకు ఇష్టం లేని... వారు వ్యతిరేకించే ప్రతి పనిని తాము వ్యతిరేకిస్తామని శుక్రవారం సాయంత్రం ప్రణవ్ విలేకరులతో పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్ నిర్మాణం వల్ల పర్యావరణం ఈ ప్రాంతంలో పూర్తిగా కలుషితమయం అవుతుందని.. త్రాగునీరు సాగునీరు విషతుల్యం అవుతుందని.. ఈ ప్రాంతంలోని వాగులు వంకలు చెరువులు కుంటలు కలుషితమై జలచరాలు నశించిపోతాయని ప్రణవ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంతేకాకుండా హుజురాబాద్ ప్రాంతంలోని లక్షలాది ఎకరాలలో పంట పొలాలు కలుషిత నీటి వల్ల పంటలు పండలేక ఎడారిమయం అవుతాయని... ఈ ప్రాంతంలోని ప్రతి కుటుంబం రోగాలమయం అవుతుందని ప్రణవ్ ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారుకు వివరించారు. గత రెండు వారాలుగా హుజురాబాద్ ప్రాంతంలో జరుగుతున్న నిరవధిక నిరాహార దీక్షలకు అన్ని వర్గాల నుండి మద్దతు లభిస్తున్నదంటే ఈ సమస్య ఎంత తీవ్రమైనదో అర్థమవుతున్నదని ప్రణవ్ ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి కి గుర్తు చేశారు. హుజురాబాద్ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ను ఏర్పాటు చేసినట్లయితే యువకులతో పాటు మృతులు వికలాంగులు గర్భిణీ స్త్రీలు డాక్టర్లకు సైతం అంతు పట్టని రోగాల పాలు అయ్యే ప్రమాదం ఉందన్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రణవ్ రాజ్యసభ సభ్యుని దృష్టికి తీసుకువెళ్లారు. హుజురాబాద్ నియోజకవర్గ ప్రజల ఆవేదనను.. ఆందోళనను పరిగణలోకి తీసుకొని ఈ సమస్యను త్వరితగతిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని నరేందర్ రెడ్డి కి ప్రణవ్ విజ్ఞప్తి చేశారు. తాను కూడా ఇప్పటికే పొన్నం ప్రభాకర్.. శ్రీధర్ బాబు.. తుమ్మల నాగేశ్వరరావు తదితరుల దృష్టికి డంపింగ్ యార్డ్ సమస్య వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితుల గురించి స్వయంగా తెలియజేయడం జరిగిందని తెలిపారు. హుజురాబాద్ శివారులో నిర్మించ తలపెట్టిన డంపింగ్ యార్డ్ ను జనావాసాలు లేని అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తే ఎవరికి ఏ అభ్యంతరం ఉండబోదని ఈ సందర్భంగా ప్రణవ్ బాబు రాజ్యసభ సభ్యునికి వివరించడం జరిగింది. ఈ ప్రాంత ప్రజల ఆందోళనను... ఆవేదనను..

వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తక్షణమే డంపింగ్ యార్డ్ ఏర్పాటు ప్రతిపదలను విరమించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని

... ఈ విషయంలో తాను అందరికంటే ఎక్కువగా దృష్టిసారించి పోరాడుతున్న విషయాన్ని ప్రణవ్ గుర్తు చేశారు.. కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను తీసుకోదని.... అనుకోకుండా జరిగిన పరిణామాలలో విశ్లేషించి ప్రజా అభిప్రాయానికి అనుగుణంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా ప్రణవ్ వెల్లడించారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ సలహాదారు... రాజ్యసభ సభ్యులైన వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ హుజురాబాద్ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు విషయం బహిర్గతం కాగానే ప్రజల నుండి పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తుతుండడం.. జేఏసీ నేతృత్వంలో అప్రతిహతంగా గత రెండు వారాలుగా రిలే..

నిరాహార దీక్షలు కొనసాగుతున్న విషయం ప్రణవ్ బాబు ద్వారా తన దృష్టికి వచ్చిందని.. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఆయన దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కారం అయ్యేలా చొరవ తీసుకుంటానని నరేందర్ రెడ్డి ప్రణవ్ బాబుకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ సుహాసిని.. సింగాపురం సుగుణాకర్ రెడ్డి.. కాజీపేట కృష్ణ.. తిప్పారపు సంపత్.. వట్లూరి విజయ్ కుమార్... గూడూరి స్వామి రెడ్డి.. చల్ పూర్ మహేందర్ రెడ్డి.. మేకల తిరుపతి.. తోట రాజేంద్రప్రసాద్.. భీమగోని సురేష్.. తదితరులు పాల్గొన్నారు

## మానవ సేవయే మాధవ సేవగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి

**-బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పిలుపు**

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్3(సిటీటైమ్స్):**

మానవ సేవయే మాధవ సేవగా చలివేంద్రాల ఏర్పాటు జరగాలి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సామాజిక కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం గాజుల రామారం డివిజన్ హెచ్ఏఎల్ కాలనీ లో శ్రీ లలితా భక్త మండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు ద్వారా దాహార్తిని తీర్చడం మాధవ సేవతో సమానమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగన్, శ్రీ లలితా భక్త మండలి సభ్యులు ప్రమీలా, లక్ష్మి సామ్రాజ్యం, విజయలక్ష్మి, కళ్యాణి, అనిత, ధనలక్ష్మి, సంధ్య, సుమతి, అరుణ, భారతి, కాలనీవాసులు ఆంజనేయులు, వీరయ్య చౌదరి, పానకాలు, సుమన్, మహేష్, మధుసూదన్ రావు, మూర్తి, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, సుంకరి చందు, చెట్ల వెంకటేష్, బోయిని మహేష్, చిన్న చౌదరి, రాములు గౌడ్, చంద్ర శేఖర్ గౌడ్, నవీన్ దండుగుల, మల్లేష్, సంగమేష్, ప్రసాద్, శివా నాయక్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



## బాచుపల్లిలో గుడ్ ఫ్రైడే సందర్భంగా ఘనంగా శాంతి ర్యాలీ

**పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు**

**బాచుపల్లి, ఏప్రిల్3( సిటీటైమ్స్):**

బాచుపల్లి పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బాచుపల్లి రాజీవ్ గాంధీ నగర్ లో గుడ్ ఫ్రైడే సందర్భంగా శాంతి ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీలో యేసుక్రీస్తు మరణం ఆయన పునరుద్ధానము గురించి తెలియజేస్తూ ఆయన బోధల గురించి వివరించారు. బాచుపల్లి పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ అధ్యక్షులు యెహోషువా పుచ్చకాయల (జాషువా) మాట్లాడుతూ.. యేసుక్రీస్తు ప్రపంచ మానవాళి పాపముల నిమిత్తము, శాపముల నిమిత్తము సిలువలో మరణము పొంది మూడవ దినమున మరణమును జయించి సమాధిని నుండి తిరిగి లేవడం జరిగింది అని తెలిపారు. అనంతరం ప్రార్థన మందిరాలలో ఉదయం 10 గంటల నుండి 3గంటల వరకు ప్రార్థనలు జరిగాయి. ఈ శాంతి ర్యాలీలో 200 మంది పైగా క్రైస్తవులు పాస్టర్స్, బాచుపల్లి పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ యెహోషువ పుచ్చకాయల (జాషువా), వర్కింగ్ ప్రెసిడెంట్ పాస్టర్ ఎన్ స్టీఫెన్ పాల్, వైస్ ప్రెసిడెంట్ జే ప్రభుదాస్, జనరల్ సెక్రెటరీ సిజిఎం పాస్టర్ సీమోన్, ట్రెజరర్ పాస్టర్ పి సేతు, అడ్వైజర్స్ పాస్టర్ ఆర్ యెహోషువ, రెవరెండ్ పుల్లారావు, రెవరెండ్ కె అబ్రాహాం పాస్టర్ బి జేమ్స్, పాస్టర్ దేవరాజు, పాస్టర్ సైమన్, పాస్టర్ విజయకుమార్, పాస్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



## ఇద్దరు కుమార్తెలను బావిలోకి తోసేసిన తండ్రి

**- కరీంనగర్ జిల్లాలో అమానుషం**

**కరీంనగర్, సిటీ టైమ్**

మరోచోట.. మరో ఘోరం.. ఈసారీ సమిధలు చిన్నారులే.. అమ్మకు కోపమొచ్చినా, నాన్నకు ఆవేశం వచ్చినా.. బలి పశువులుగా మారుతోంది కన్న బిడ్డలే. భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని.. ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్న మహిళ ఘటన మరువకముందే తెలంగాణలో మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. కన్న బిడ్డలను అల్లారుముద్దుగా, కంటికి రెప్పలా కాయాల్సిన తండ్రి.. వారి పాలిట కిరాతకుడిగా మారాడు. నిర్దాక్షిణ్యంగా బావిలోకి తోసి వారి నిండు జీవితాన్ని బలి తీసుకున్నాడు. కరీంనగర్ రూరల్ మండలంలోని జూబ్లీనగర్‌లో ఈ దారుణ, అమానుష ఘటన చోటుచేసుకుంది. కవలలు అయిన కన్న కూతుళ్లను అల్లారుముద్దుగా చూడాల్సిన ఆ తండ్రి.. కర్కశుడిగా మారి, తన చేతులతో వారిని బావిలోకి తోసేశాడు.

ఐదేళ్ల వయసు ఉన్న ఇద్దరు పిల్లలను తొలుత బావిలోకి తోసేసిన శ్రీశైలం అనే వ్యక్తి.. తర్వాత తాను కూడా బావిలోకి దూకేశాడు. అయితే దూకిన తర్వాత ప్రాణ భయంతో ఈదుకుంటూ బయటకు వచ్చేశాడు. కానీ పాపం.. ఆ చిన్నారులు తండ్రి క్షణికావేశంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న స్థానికులు.. బావి వద్దకు చేరుకుని గాలించారు. ఒక బాలిక మృతదేహం లభించగా.. మరో చిన్నారి మృతదేహం కోసం గాలిస్తున్నారు. ఇద్దరు కుమార్తెలను బావిలోకి తోసేసిన శ్రీశైలాన్ని చితకబాది పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. మరో చిన్నారి మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే కుటుంబ కలహాలే శ్రీశైలం ఇలా చేయడానికి కారణంగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

శుక్రవారం ఉదయం భార్యతో శ్రీశైలం గొడవపడినట్లు తెలిసింది. ఈ ఆవేశంలోనే ఇద్దరు కుమార్తెలతో కలిసి బావి వద్దకు చేరుకున్న శ్రీశైలం.. ఆ ఆవేశంలో పసి ప్రాణాలను బలి తీసుకున్నట్లు తెలిసింది. మరోవైపు పిల్లలను గడ్డిమందు తాగించి బావిలోకి తోసేశారనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై పోలీసులు మరింత సమాచారం అందించాల్సి ఉంది. అయితే ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పిల్లల ప్రాణాలు తీశావంటూ శ్రీశైలాన్ని స్థానికులు చితకబాదారు. ఆ తర్వాత పోలీసులు స్థానికులను అడ్డుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం శ్రీశైలాన్ని పోలీసులు విచారిస్తున్నారు. ఇంతటి కఠిన నిర్ణయం తీసుకోవడానికి కారణాలు ఏమిటనే దానిపై ఆరా తీస్తున్నారు.



# రాజకీయాలు రాజేసిన 'యుద్ధజ్వాలలివి...'

ప్రపంచ దేశాల సైనిక వ్యయం 2024లో 2.7 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. 2035 నాటికి అది 4.7 లక్షల కోట్ల డాలర్లు కావచ్చు అంటున్నారు. దీనికి కారణమేంటి?

దీనికి రెండు కారణాలున్నాయి. ఒకటి... పశ్చిమాసియా, ఉక్రెయిన్ యుద్ధాలు. రెండోది... రక్షణ బడ్జెట్లను పెంచమని తమ భాగస్వామ్య దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెచ్చిన ఒత్తిడి. గాజా, లెబనాన్‌లపై ఇజ్రాయెల్ దాడులు చేయడం, ఇప్పుడు ఇరాన్ యుద్ధం నేపథ్యంలో గల్ఫ్ దేశాలూ అదేపని చేస్తున్నాయి. చైనా తన సైన్యాన్ని ఆధునికీకరించింది. బీజింగ్‌కు పలు దేశాలతో సముద్రంలోనూ, భౌగోళికంగానూ వివాదాలున్నాయి. చైనా దూకుడును నిలువరించడానికి ఆయా దేశాలు తమ రక్షణ బడ్జెట్‌లను పెంచాయి. లాటిన్ అమెరికాలోనూ పరిస్థితులు ఉద్రిక్తంగానే ఉన్నాయి. పశ్చిమార్ధ గోళాన్ని తమ ప్రాధాన్య ప్రాంతంగా ట్రంప్ ప్రకటించారు. ఇదీ మిలటరీ ఖర్చులు పెరగడానికి కారణం కావచ్చు. దక్షిణాఫ్రికా, సోమాలియా, ఇథియోపియా, లిబియా, నైజీరియా, కాంగో తదితర దేశాల్లోనూ పరిస్థితులు బాగలేవు. సాయుధ ఘర్షణలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో రక్షణ బడ్జెట్లు అనివార్యంగా పెరుగుతున్నాయి. మరోవైపు... సైన్యంలో ఏఐ వినియోగం గురించి మాట్లాడుతున్నారు. నిఘాకు, సమాచారాన్ని పక్కాగా సేకరించడానికి అంతరిక్ష ఆధారిత సాంకేతికతను వినియోగిస్తున్నారు. వీటితోపాటు ముందస్తు హెచ్చరికలు, క్షిపణి రక్షణ వ్యవస్థలపైనా ప్రభుత్వాలు ఎక్కువగా ఖర్చు చేస్తున్నాయి. మొత్తానికి ప్రపంచంలో ఘర్షణలు పెరగడం, మిలటరీ వ్యవస్థల్లో ఆధునిక సాంకేతికతల వాడకం వల్ల వ్యయం విపరీతమవుతోంది.

యుద్ధాలూ సాయుధ ఘర్షణలకు ప్రధాన కారణం రాజకీయాలు. కొన్ని దేశాలు గత వైభవాల గురించి ఆలోచించడమూ సమస్యాత్మకమవుతోంది. రష్యా అలాగే చెబుతూ, ఉక్రెయిన్ తమ సాంస్కృతిక వారసత్వంలో భాగమని వాదిస్తోంది. ప్రపంచీకరణ, వలసల వల్ల తమ వైభవం దెబ్బతిందని అమెరికా భావిస్తోంది. ఇరాన్ కూడా తమ సొంత వైభవం గురించి మాట్లాడుతోంది. రాజకీయ కారణాలతో ప్రజల్లో అసంతృప్తి నెలకొన్నప్పుడు, చారిత్రక అంశాలను తమకు అనుకూలంగా మలుచుకుని రాజకీయంగా లాభం పొందడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీంతో పక్కదేశాలతో వివాదాలు, సైనిక వ్యయాలు ఎక్కువైపోతున్నాయి.

ఆ సత్తాను సాధించడానికి ఇరాన్‌కు చాలాకాలమే పట్టొచ్చు. దీనికి ప్రధాన కారణం ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా ఖమేనీ అణ్వాయుధాలు న్యాయబద్ధమైనవి కావని, ఇస్లామిక్ సూత్రాలకు అవి వ్యతిరేకమని గతంలో ఫత్వా జారీ చేయడమే. ఇప్పుడు కొత్త నాయకత్వం దానిపై ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదు. దీంతోపాటు నిరుడు 'పన్నెండు రోజుల యుద్ధం'లో ఇరాన్ అణు సదుపాయాలను అమెరికా, ఇజ్రాయెల్ ధ్వంసం చేశాయి. ఆ దేశ శాస్త్రవేత్తలు పలువురు హత్యకు గురయ్యారు. ఇరాన్ దగ్గర శుద్ధి చేసిన 400 కేజీల యురేనియం ఉన్నట్లు వార్తలు వస్తున్నా... అదెక్కడ ఉందో ఎవరికీ తెలియదు. దాన్ని అణ్వాయుధంగా మార్చడానికి కొన్ని నెలలు పడుతుంది. సాధారణ పరిస్థితుల్లో ఇరాన్‌పై ఆంక్షలు లేకపోతే రాజకీయంగా నిర్ణయం తీసుకుని, అవసరమైన వనరులను సమీకరించుకుని, శాస్త్రవేత్తలకు లక్ష్యం నిర్దేశిస్తే- ఇదంతా పూర్తికావడానికి నాలుగు నుంచి ఆరునెలల సమయం పట్టొచ్చు.

ప్రారంభంలో అవి ఈ యుద్ధానికి సానుకూలం కాదు. ఎందుకంటే, చాలా దేశాలు ఇరాన్‌తో సంబంధాలను మెరుగుపరచుకున్నాయి. ఉదాహరణకు ఖతార్, ఇరాన్‌లు ప్రపంచంలోనే అతి పెద్ద గ్యాస్‌ఫీల్డ్‌ను సంయుక్తంగా కలిగి ఉన్నాయి. యూఏఈ కూడా ఇరాన్‌తో సత్సంబంధాలే నెరపుతోంది. చిరకాల శత్రుత్వం తరవాత చైనా మధ్యవర్తిత్వంతో సౌదీ అరేబియా, ఇరాన్‌ల మధ్య కూడా ఉన్నత స్థాయిలో రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఈ కారణంగానే ఈ ప్రాంతాన్ని అస్థిరపరిచే యుద్ధం పట్ల మొదట్లో ఇవేవీ ఆసక్తిగా లేవు. అయితే పోరు ప్రారంభమై ఆ ప్రాంతం మొత్తం వ్యాపించింది. వీలైనంత త్వరగా కాల్పుల విరమణ జరుగుతుందని గల్ఫ్ దేశాలు భావించాయి. అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య తరచూ ఘర్షణ నెలకొంటుండటంతో ఈ యుద్ధంతో టెహ్రాన్‌లో నాయకత్వం మార్పు జరుగుతుందేమో చూద్దామని కూడా అవి అనుకున్నాయి. ఒకవేళ ఇజ్రాయెల్, అమెరికా బలగాలు ఇరాన్ భూభాగంలోకి ప్రవేశించినా, అక్కడి పాలకులను మార్చడం చాలా కష్టం. ఇందుకు అఫ్గానిస్థాన్ పరిణామాలు ఒక ఉదాహరణ.

చర్చల ద్వారా పరిష్కారం గురించి ఇండియా మాట్లాడుతోంది. ఇది మంచిదే కానీ- ఈ యుద్ధాన్ని ఎవరు ప్రారంభించారు, అసలు ఈ పరిస్థితి రావడం వెనక ఎవరి ప్రోద్బలం ఉంది తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని భారత్ స్పష్టమైన వైఖరి తీసుకోవాల్సింది.

# నదులకు జీవకళ రావాలి!

మూసీ నది ఒకప్పుడు హైదరాబాద్ ప్రజల గొంతు తడిపేదని చెబితే నేటితరం నమ్మదేమో! అంతగా అది కాలుష్య కాసారంగా మారిపోయింది. ఒక్క మూసీ అనే ఏముంది... పారిశ్రామిక, పంట వ్యర్థాలు, మురుగు, జంతు కళేబరాల వెల్లువకు తోడు విచ్చలవిడి ఆక్రమణలతో ఆసేతు హిమాచలం చాలా నదులు వాటి అసలు స్వరూప స్వభావాలను కోల్పోతున్నాయి. నిరంతర నీటి కాలుష్యం కారణంగా భూగర్భ జలాలూ విషతుల్యం అవుతున్నాయి. వాటితో పండించే పంటల్లోకి భారలోహాలు వచ్చి చేరి ఆరోగ్యాలను గుల్లచేస్తున్నాయి. ఇలాంటి దుర్భరావస్థలో నాగరికతకు నడకలు నేర్పిన నదుల పునరుజ్జీవాన్ని పలు రాష్ట్రాలు భుజాలకెత్తుకున్నాయి. గుజరాత్‌లో సబర్మతి, రాజస్థాన్‌లోని చంబల్ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టులు స్థానిక నదుల రూపురేఖలు మార్చాయి. ఈ క్రమంలోనే ఒకప్పుడు భాగ్యనగరానికి జీవనాడిగా నిలిచిన మూసీకి కొత్త జవసత్వాలు కల్పించేందుకు తెలంగాణ సర్కారు నడుంకట్టింది. వరద నియంత్రణకు ఉపయుక్తం కావడంతోపాటు నగరవాసులకు ఆహ్లాదం పంచుతూ ఆర్థిక ప్రగతికి ఆలంబన అయ్యేవిధంగా మూసీకి మహర్దశ పట్టించాలని సంకల్పించింది. దీర్ఘకాల విస్తృత ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఇది ఎన్నదగిన చొరవే! అదే సమయంలో ప్రతిపాదిత ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులయ్యే వారికి పునరావాస కల్పనలో ప్రభుత్వం సంక్షేమ రాజ్య ధర్మాన్ని నిష్ఠగా పాటించాలి!



భాగ్యనగరంలో నిత్యం పొంగిపొర్లే 200 కోట్ల లీటర్ల మురుగులో అధిక శాతం మూసీలోనే కలుస్తోంది. నగరభారతం మొత్తమ్మీద పుట్టుకొచ్చే మురుగునీటిలో దాదాపు ముప్పావు శాతం నేరుగా నదులు, చెరువులు, కుంటల్లోకి చేరిపోతోంది. నిబంధనలను ఖాతరు చేయని చాలా పరిశ్రమలు హానికర రసాయనాలను యథేచ్ఛగా నదుల్లోకి వదిలేస్తున్నాయి. నదీనదాలూ ఇతర జలవనరులను చెత్తబుట్టలుగా పరిగణించే పెడపోకడలు దేశ సౌభాగ్యానికి చేటుచేస్తున్నాయి. 2009లో దేశవ్యాప్తంగా 150 నదీ ప్రవాహ ప్రాంతాలు కాలుష్యం గుప్పిట చిక్కితే, 2023 నాటికి అలాంటి వాటి సంఖ్య దాదాపు రెట్టింపైంది. కృష్ణా, గోదావరి, తుంగభద్ర, పెన్నా, మంజీర, శబరి తదితరాలతో పాటు నర్మద, యమున, గంగ లాంటివెన్నో డంపింగ్ యార్డులుగా మారిపోయాయి. పవిత్ర గంగానది ప్రక్షాళనకు ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వ్యర్థాల వెల్లువ ఆగట్లేదు. నదులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్న పౌరస్పృహ పెరగకపోతే జరుగుతున్న పర్యావరణ విధ్వంసానికి ఇక అంతుండదు!

సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తూ కోట్లాది మందికి జీవనోపాధి కల్పిస్తున్న నదులు చిక్కిశల్యమైతే ఆర్థిక, సామాజిక, పర్యావరణ విపరిణామాలెన్నో సంభవిస్తాయి. అలాంటి వాటిని నివారించి, భద్రమైన జనజీవనానికి భరోసా కల్పించేందుకు న్యూజిలాండ్, కెనడా వంటివి నదులకు మనిషితో సమానమైన చట్టబద్ధ హక్కులు కల్పిస్తున్నాయి. ప్రాంతీయ ప్రగతిలో నదుల ప్రాధాన్యాన్ని గుర్తించిన ఇంగ్లాండ్ అధ్వాన స్థితికి చేరిన థేమ్స్‌కు మళ్లీ స్వచ్ఛ జలకళ తెచ్చింది. ఎల్లో, పెరల్ పరీవాహకాల్లో కాలుష్య కట్టడికి చైనా భారీ ప్రాజెక్టులు చేపట్టింది. రైన్, డాన్యూబ్ నదుల పునరుద్ధరణలో ఐరోపా దేశాల చిత్తశుద్ధి ప్రశంసనీయమైనదే! దక్షిణ కొరియా, జపాన్, ఫ్రాన్స్ వంటివీ మురికి కూపాలుగా మారిన నదులకు ప్రాణప్రతిష్ఠ చేసి పర్యాటక ప్రదేశాలుగా మలిచాయి. పట్టణ ప్రాంతాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడానికి, జీవావరణ సమతుల్యత కోసం మన దేశంలో స్మార్ట్ సిటీస్ మిషన్ కింద పలు రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను చేపట్టారు. ఇలాంటి వాటిని త్వరితగతిన లోపరహితంగా పూర్తిచేయడంతో పాటు అన్ని నదులనూ కాలుష్యరహితం చేయడం ప్రభుత్వాల కర్తవ్యం!

# నాలుగేళ్ల యుద్ధం...ఎప్పుడు ముగుస్తుంది?

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలై నాలుగేళ్లు దాటి పోయింది. రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఐరోపా ఖండంలో జరుగుతున్న అత్యంత భీషణ సంగ్రామం ఇదే. దీనివల్ల అపారంగా ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవిస్తున్నాయి. అంతర్జాతీయ ఆహార, ఇంధన సరఫరా గొలుసులు దెబ్బతినిపోయాయి. 2022-25 మధ్య శాంతి సాధనకు జరిగిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఈ యుద్ధాన్ని ఎలా ఆపాలన్న విషయంలో అమెరికా, నాటో మిత్రుల మధ్య ఇటీవల విభేదాలు తలెత్తాయి. దాంతో అమెరికా చొరవతో త్వరలో జరగనున్న సయోధ్య ప్రయత్నాలపైనా అనిశ్చితి అలుముకుంది.అమెరికా, ఐరోపా దేశాల సైనిక కూటమి నాటో: ఒకప్పుడు సోవియట్ యూనియన్ అంతర్భాగాలుగా ఉండి తరవాత స్వతంత్ర దేశాలైన ఉక్రెయిన్, జార్జియా వంటి వాటిని నాటో కూటమిలోకి చేర్చుకోరాదని రష్యా 2021 డిసెంబరులో షరతు పెట్టింది. అంటే నాటో సేనలు తన సరిహద్దుల వరకు విస్తరించకూడదన్నది దాని అంతరార్థం. అలాగే 1997 మే తరవాత ఆ కూటమిలో చేరిన దేశాల్లో అమెరికా, నాటో సేనలను, ఆయుధాలను మోహరించకూడదన్నది రెండో షరతు. రష్యా పెట్టిన ఈ రెండు షరతులనూ అమెరికా, నాటోలు తిరస్కరించాయి. ఉక్రెయిన్‌ను కూటమిలో చేర్చుకుంటే అమెరికా, నాటో సేనలు తన సరిహద్దుల వరకు చేరుకుంటాయనీ, అది తన భద్రతకు ప్రమాదకరమని రష్యా భావిస్తోంది. నాటోకూ రష్యాకూ మధ్య తటస్థ దేశంగా ఉక్రెయిన్ ఉండాలన్నది మాస్కో అభిమతం. 2021లో తన షరతులను అమెరికా, నాటోలు తోసిపుచ్చడంతో- 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా ప్రత్యేక సైనిక చర్య తీసుకుంది. ఇది పూర్తిస్థాయి యుద్ధమని అమెరికా, నాటోలు భావించాయి.



అండదండలు అందించినా...

రష్యా సేనలు ఉక్రెయిన్‌ను కొద్ది వారాల్లోనే లొంగదీస్తాయని మొదట్లో అంచనాలు వినవచ్చాయి. కానీ, మాస్కోను ఆర్థికంగా, సైనికంగా బలహీనపరచాలని అమెరికా, నాటో దేశాలు ఉక్రెయిన్‌కు అండగా నిలిచాయి. ఆర్థికంగా, సైనికంగా తోడ్పడటంతో పాటు నిఘా సమాచారాన్నీ ఉక్రెయిన్‌కు అందించాయి. అమెరికా, ఐరోపా బ్యాంకుల్లోని రష్యా డిపాజిట్లను స్తంభింపజేశాయి. ఆ దేశ చమురు ఎగుమతులపై ఆంక్షలు విధించాయి. ఉక్రెయిన్ భుజంపై తుపాకీపెట్టి రష్యాను కాల్చసాగాయి. 2025 సంవత్సరాంతం వరకు అమెరికా పార్లమెంటు ఉక్రెయిన్‌కు 18,800 కోట్ల డాలర్ల నిధులు అందించి ఆయుధ కొనుగోళ్లకు సహకరించింది. అంతకుముందు 2024 చివర్లో అమెరికా ప్రపంచ బ్యాంకు నుంచి ఉక్రెయిన్‌కు రెండు వేలకోట్ల డాలర్ల రుణం ఇప్పించింది. దానికయ్యే వడ్డీని రష్యన్ డిపాజిట్ల నుంచి చెల్లించే ఏర్పాటూ చేసింది! యుద్ధం మొదలైనప్పటి నుంచి ఉక్రెయిన్‌కు ఐరోపా సమాఖ్య(ఈయూ) ఆర్థిక, మానవతా సాయం రూపంలో 10,400 కోట్ల యూరోలను అందించింది. రష్యా దూకుడును అమెరికా, నాటోలు తగ్గించగలిగాయే గానీ, ఉక్రెయిన్ నుంచి మాస్కో సేనలు వెనుదిరిగేలా చేయలేకపోయాయి. ఉక్రెయిన్ తూర్పు ప్రాంతాలతోపాటు డొనెట్స్క్, లుహాన్స్క్, జపోరిజియా, ఖేర్సన్‌లను కూడా మాస్కో ఆక్రమించేసింది. బైడెన్ హయాంలో అమెరికా, నాటోలు రష్యాపై సైనిక, ఆర్థిక మార్గాల్లో విజయం సాధించాలని పట్టుదలగా ఉండేవి. ట్రంప్ అధ్యక్షుడైన తరవాత పరిస్థితి మారిపోయింది. యుద్ధాన్ని నిలిపేసిన నేతగా చరిత్రలో నిలిచిపోవాలని ఆయన ఆరాటపడుతున్నారు.

నిరుడు రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య శాంతిసయోధ్యల సాధనకు ట్రంప్ తనదైన శైలిలో చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మొన్న ఆగస్టులో అలాస్కాలో జరిగిన ట్రంప్, పుతిన్‌ల శిఖరాగ్ర సమావేశం కూడా యుద్ధానికి తెరదించలేకపోయింది. వాషింగ్టన్ మధ్యవర్తిత్వంలో రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య జరిగిన చర్చలూ ఫలించలేదు. ఎవరూ వెనక్కి తగ్గకపోవడం, రాజీపడటానికి సిద్ధంగా లేకపోవడమే ఈ పరిస్థితికి కారణం. ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చుకోరాదనీ; యుద్ధం ముగిసిన తరవాత కూడా ఉక్రెయిన్ భద్రతకు నాటో పూచీ తీసుకోరాదనీ... తనపై విధించిన ఆర్థిక ఆంక్షలను ఎత్తివేయాలనీ; ఇప్పుడు తన ఆధీనంలోకి వచ్చిన తూర్పు ఉక్రెయిన్ ప్రాంతాలను తిరిగిచ్చేది కూడా లేదనీ రష్యా భీష్మించుకుని కూర్చుంది! ఈ ప్రాంతాలు ఉక్రెయిన్ భూభాగంలో అయిదో వంతుకు సమానం. ఇది కాకుండా 2014లో రష్యా ఉక్రెయిన్ నుంచి క్రిమియాను స్వాధీనం చేసుకుంది. దాన్ని రష్యా అంతర్భాగంగా అంతర్జాతీయ సమాజం గుర్తించాలని మాస్కో డిమాండ్ చేస్తోంది. దీనికి ఉక్రెయిన్ ససేమిరా అంటున్నా, ట్రంప్ మాత్రం ఆయా భూభాగాలను రష్యాకు ధారాదత్తం చేసేందుకు సుముఖంగానే ఉన్నారు! ఐరోపా దేశాలు మాత్రం ఉక్రెయిన్‌కు బాసటగా నిలుస్తున్నాయి. ఉక్రెయిన్ భూభాగాలను కలిపేసుకోవడానికి రష్యాను అనుమతిస్తే, భవిష్యత్తులో ఇతర దేశాలూ అలాగే చేస్తాయని వాదిస్తున్నాయి.

భారత్‌కు తప్పని తలనొప్పులు!

ఉక్రెయిన్ యుద్ధం ఇండియాను ఇరకాటంలోకి నెట్టింది. భారత్‌కు రష్యా, ఉక్రెయిన్‌లతో స్నేహ సంబంధాలు ఉన్నాయి. యుద్ధం ప్రారంభమయ్యాక రష్యా నుంచి తగ్గింపు ధరలకు చమురు కొనవద్దనీ, మాస్కో తీరును ఖండించాలనీ అమెరికా, ఐరోపా దేశాల నుంచి న్యూదిల్లీపై ఒత్తిడి పెరిగింది. భారత్ అందుకు అంగీకరించకుండా, తన ఇంధన భద్రత కోసం రష్యన్ చమురును కొనుగోలు చేస్తూనే ఉంది. ఉక్రెయిన్‌పై దండెత్తినందుకు రష్యాను ఖండించలేదు గానీ, ఇవి యుద్ధాలకు రోజులు కావనీ, వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని హితవు చెప్పింది. బైడెన్, ఐరోపా నాయకులు మొదట్లో భారత వైఖరితో సర్దుకుపోయారు. అయితే, ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటే భారత్‌పై 25శాతం 'జరిమానా సుంకాలు' విధిస్తానని నిరుడు ఆగస్టులో ప్రకటించారు. దాంతో మొత్తం సుంకాలు 50శాతానికి చేరాయి. ఇది భారత్‌అమెరికా సంబంధాలను ఒత్తిడికి గురిచేసింది. కానీ ఈ ఫిబ్రవరిలో సుంకాలను 18శాతానికి తగ్గించడం, త్వరలోనే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదరనుందని ప్రకటించడం పరిస్థితిని కాస్త ఉపశమింపజేసింది. ఏదిఏమైనా, అంతూపొంతూ లేకుండా సాగుతున్న రష్యాఉక్రెయిన్ సమరాన్ని ముగించడానికి అంతర్జాతీయ సమాజం గట్టి పూనిక వహించాలి.

# ఎన్నికల బరిలో పోటాపోటీగా...

పశ్చిమాసియా యుద్ధజ్వాలలు భారతీయ వంటగదుల వరకు వ్యాపించి, గ్యాస్ ఇక్కట్ల రూపేణా సామాన్య జనజీవనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న సమయంలో కీలక రాజకీయ రణరంగానికి తెరలేచింది. ప్రాంతీయ అస్తిత్వం, ప్రజా సంక్షేమం, అభివృద్ధి, అధికారాలను తమవైన భిన్న దృక్కోణాల్లోంచి నిర్వచించే పార్టీల కార్యక్షేత్రాల్లో ఎన్నికల పోరుకు ఈసీ మొన్న నగారా మోగించింది. అస్సాం, పశ్చిమ్ బెంగాల్, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిల్లోని 824 స్థానాలకు వచ్చే నెలలో నిర్వహించనున్న ఎలక్షన్‌లలో 17.4 కోట్ల మంది ఓటర్లు పాలుపంచుకోనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎనిమిది మినహా మిగిలిన ఏ దేశ జనాభాతో పోల్చినా ఈ అయిదు శాసనసభల పరిధిలోని ఓటర్ల సంఖ్యే అధికం. ఒకవిధంగా ఇదో మినీ సార్వత్రిక సమరం! 2024 లోక్‌సభ ఎన్నికల అనంతరం ఎలక్షన్లకు వెళ్లిన ఆరు రాష్ట్రాల్లో రెండు చోట్ల సొంతంగా, మరో రెండింట మిత్రపక్షాలతో కలిసి విజయధ్వజం ఎగరేసిన భాజపా ప్రస్తుతం రెట్టించిన ఉత్సాహంతో రణతంత్రాలను రచిస్తోంది. వరస పరాజయాల పెనుభారంతో చిక్కిశల్యమవుతున్న కాంగ్రెస్- అస్సామ్‌లో మాత్రమే నేరుగా కమలదళంతో తలపడుతోంది. పశ్చిమ్‌బెంగాల్‌లో ఉనికిని నిలబెట్టుకోవడానికి శ్రమించాల్సి వస్తున్న హస్తంపార్టీకి, పదేళ్లుగా ప్రతిపక్షంలోనే ఉండిపోయిన కేరళలోనూ జీవన్మరణ పోరాటం తప్పట్లేదు. జాతీయస్థాయిలో ప్రతిపక్ష కూటమి సారథ్య బాధ్యతలను మమతాబెనర్జీ, ఎంకే స్టాలిన్‌లలో ఎవరోఒకరికి అప్పగించాలన్న డిమాండ్లు వినవస్తున్న నేపథ్యంలో స్వరాష్ట్రాల్లో ఆ ఇద్దరి భవితవ్యాన్ని నిర్దేశించే ప్రజాతీర్పుపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొందిప్పుడు!

ద్రవిడ రాజకీయాల్లో కాకలుతీరిన రెండు పార్టీల మధ్యే ఎప్పుడూ అధికారం దోబూచులాడే తమిళనాడులో నేడు పోరు ముక్కోణమవుతోంది. సుప్రసిద్ధ సినీనటుడు విజయ్ రంగప్రవేశం డీఎంకే, అన్నాడీఎంకే శిబిరాల్లో ఎవరి ఓట్లకు కత్తెరవేస్తుందన్న ఉత్కంఠ ఆ రాష్ట్రాన్ని ఊపేస్తోంది. 2021లో తాము చేసిన 505 ఎన్నికల వాగ్దానాల్లో 364 హామీలను నిలబెట్టుకున్నామంటున్న డీఎంకే సంక్షేమ పథకాల ఊతంతో గెలుపు జెండా ఎగరేయగలమన్న ధీమాను ప్రదర్శిస్తోంది. గడిచిన అయిదేళ్లలో అప్పులు, అవినీతి బాగోతాలు, మహిళలపై దాడులు ఎక్కువైపోయాయంటున్న అన్నాడీఎంకే ప్రభుత్వ వ్యతిరేకతే తమను గట్టెక్కిస్తుందని నమ్ముతోంది. శబరిమల బంగారం దొంగతనం కేసులో అస్మదీయ సీనియర్ నేత అరెస్టు కావడం కేరళ పాలకపక్షం ఎల్డీఎఫ్‌కు ఇబ్బందికర పరిస్థితిని సృష్టించింది. మౌలిక సదుపాయాలు, పేదరిక నిర్మూలన, విద్య, వైద్యాల్లో విజయన్ సర్కారు సాధించిన విజయాలను ఆ కూటమి ప్రచారాస్త్రాలుగా మార్చుకుంటోంది. పెరుగుతున్న నిరుద్యోగం, సాగు సంక్షోభం లాంటివాటి మాటేమిటని ప్రతిపక్ష శిబిరం యూడీఎఫ్ నిగ్గదీస్తోంది. తండ్రి కరుణానిధికి సైతం సాధ్యంకాని రీతిలో స్టాలిన్ అధికారాన్ని నిలబెట్టుకుంటారా, విజయన్ మూడోసారి పీఠమెక్కుతారా లేదా ప్రజామోదంకోసం సర్వశక్తులు ఒడ్డుతున్న విపక్షాలకు కాలం కలిసివస్తుందా అన్నది మే నాలుగున తేలుతుంది!

'సర్' దరిమిలా అరవై లక్షల మంది ఓటర్ల భవిత ఇంకా ప్రశ్నార్థకంగా మిగిలిన పశ్చిమ్ బెంగాల్‌లో మమతాబెనర్జీ సైతం సంక్షేమ వరదానాలపైనే ఆశలుపెట్టుకున్నారు. పదిహేనేళ్లుగా రాష్ట్రాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలుతున్న ఆమెకు ఈసారి ఓటమిని చవిచూపించాలని కమలనాథులు పట్టుదలతో ఉన్నారు. అటు అస్సామ్‌లో అభివృద్ధి, నగదు బదిలీ పథకాలను మేళవించిన పాలనావ్యూహాలతో భాజపా దూకుడు మీద ఉంటే, ప్రతిపక్షంలో చీలికలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. డబ్బు, మద్యం, ఇతరేతర ఓట్ల తాయిలాలతో కూడిన మన ఎన్నికల భ్రష్టాచారాలకు ఇప్పుడు ఏఐతో పుట్టుకొస్తున్న తప్పుడు వీడియోలు, నకిలీవార్తలు తోడవుతున్నాయి. ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెళ్లగించే ఈ పెనుభూతాలకు పగ్గాలేస్తూ, ఎలక్షన్లను స్వేచ్ఛగా సక్రమంగా నిర్వహించే పరీక్షలో ఈసీ ఎంతవరకు నెగ్గుకొస్తుందో చూడాలి!

# దొడ్డి కొమరయ్య ఆశయాలను ఆశయాలను కొనసాగిద్దాం

**బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి మోడల శ్రీనివాస్ సాగర్...**

**ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో సిటి టైమ్స్ ఏప్రిల్ 03**



తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని హైదరాబాద్ సంస్థానాధీశ ఏడవ నిజాం నవాబు ఉస్మాన్ ఆలీ ఖాన్ అండ కలిగిన స్థానిక భూస్వాములు, దొరల అరాచకాల నుంచి విముక్తి కోసం సంస్థాన ప్రజలతో కలిసి 1946 నుంచి 1948 మధ్య వీరోచిత పోరాటం చేశారనీ చెప్తూ ఆయన స్ఫూర్తి తో ఆశయాలను కొనసాగించాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి మరియు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్ అన్నారు..పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్ లోగల దొడ్డి కొమరయ్య విగ్రహానికి పూలమాలవేసి జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ సాగర్ మాట్లాడుతూ మనుషులను వెట్టి చాకిరి చేయించడంలో వడ్డీలు వసూలు చేయడంలో రకరకాల శిక్షలు, జరిమానాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప మహనీయుడు దొడ్డి కొమరయ్య అన్నారు.. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిననూ నిజాం సంస్థానంలోని ప్రజలకు మాత్రం స్వాతంత్ర్యం లేకపోవడాన్ని దొడ్డు కొమురయ్య జీర్ణించుకోలేక ప్రజలతో కలిసి నిజమైన స్వాతంత్రం వచ్చేదాకా పోరాడిన మహనీయుడన్నారు. దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో పనిచేసి నిజమైన ప్రజాస్వామ్యం స్థాపించుకోవాలని ఈరోజు ప్రాణాలు అర్పించాల్సిన పనిలేదని బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు తమకు జరుగుతున్న అన్యాయాలను ఎదిరించి రాజ్యాధికారం స్థాపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జాక్ కన్వీనర్ సారంగి లక్ష్మీకాంత్, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న పాల్గొన్నారు..

# రామాంజనేయ కాలనీలో ఘనంగా గ్రామసభ





- **అందరం కలిసి గ్రామాన్ని అభివృద్ధిలో నడుపుదాం**
- **సమస్యలను వన్ బై వన్ పరిష్కరిస్తున్నాం**
- **సర్పంచ్ , ఉప సర్పంచ్**

**చుంచుపల్లి , సిటీ టైమ్స్ ,**

మండల పరిధిలోని రామాంజనేయ కాలనీ గ్రామ పంచాయతీ కార్యాలయం నందు గ్రామ సర్పంచ్ సరిత టాగూర్ అధ్యక్షతన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పాలకమండలి సమక్షంలో గ్రామసభ నిర్వహించారు . ముందుగా గ్రామ కార్యదర్శి రమేష్ ప్రభుత్వం రూపొందించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సరిత ఠాగూర్ , ఉప సర్పంచ్ కోదూరి నాగేష్ మాట్లాడుతూ గ్రామం లోని సమస్యలను వన్ బై వన్ పరిష్కరిస్తున్నామని , గ్రామంలో మౌలిక వసతులు కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని , గ్రామస్తులందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని , గ్రామాభివృద్ధికి అందరం కలిసికట్టుగా కృషి చేసి అభివృద్ధి చేద్దామని వారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ వార్డ్ మెంబర్స్ ,ఎంపీఓ సంధ్య , వివిధ శాఖల అధికారులు , గ్రామస్తులు , మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

# పేదల ముఖాల్లో చిరునవ్వులు నింపుతున్న "ఇందిరమ్మ రాజ్యం": పెద్దమందడిలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**పెద్దమందడి సిటీ టైమ్స్ ఏప్రిల్ 3**

కష్టాల్లో ఉన్న వారికి కాంగ్రెస్ ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోంది. పెద్దమందడి మండల కేంద్రంలో ఆరోగ్యపరమైన ఇబ్బందులతో ఆర్థికంగా చితికిపోయిన పలు నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి ( సీఎంఆర్ఎఫ్ ) చెక్కులను నాయకులు ఘనంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పనితీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమయ్యాయి. అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ ఫలాలు అందాలనే లక్ష్యంతో, దరఖాస్తు చేసుకున్న వెంటనే స్పందించి, చెక్కులు మంజూరయ్యేలా ఎమ్మెల్యే చేస్తున్న కృషిని నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించే మేఘా రెడ్డి నాయకత్వం నియోజకవర్గానికి గర్వకారణమని వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఐ. సత్య రెడ్డి(వనపర్తి జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ), కొమ్ము వెంకటస్వామి(మాజీ జడ్పీటీసీ ),సూర్య రవి, □బోయిని ఉషన్న యాదవ్ (ఉప సర్పంచ్),సీనియర్ నాయకులు పల్లె సత్యనారాయణ, వాకిటి నరేష్, ఐ. ప్రవీణ్ కుమార్ రెడ్డి, రాఘవేంద్ర టి ఏం ఆర్ నాయకులు గట్టు రాజశేఖర్, జంగం శివ, కురుమన్న, అశోక్, దర్శన్, వెంకటన్న, శ్రీను, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు .ప్రభుత్వానికి జేజేలు పలుకుతున్న లబ్ధిదారులు "ఆపదలో ఆదుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం మా పాలిట దైవం" అని లబ్ధిదారులు ఈ సందర్భంగా భావోద్వేగానికి లోనయ్యారు.

# 28 వార్డులో పారిశుద్ధ్యం ను పట్టించుకోని మున్సిపల్ సిబ్బంది

- **మొరిపైనే ఇంటి వ్యర్థాలు...**
- **గత 6 నెలలుగా**
- **శానిటేషన్ పై స్పందించని వనపర్తి మున్సిపల్ సిబ్బంది...**

**వనపర్తి సిటీ టైమ్స్ ఏప్రిల్ 03**

వనపర్తి మున్సిపల్ అధికారులు శానిటేషన్ విషయంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గత ఆరు నెలల క్రితం 28 వ వార్డులో పార్కు సమీపం లో మజీద్ ముందు పాత ఇంటినీ తొలగించిన వ్యర్థాలను డ్రైనేజీపై వేయడం తో డ్రైనేజీ లో సిమెంట్ వ్యర్థాలు డ్రైనేజీలో పడుతున్నాయి . అలాగే రోడ్డు పక్కనే వ్యర్థాలు వేయడం తో రహదారి కూడా కొంత ఇబ్బంది గా ఉంది.. గత 6 నెలల నుండి మున్సిపల్ అధికారులు శానిటేషన్ విషయంలో పూర్తిగా నిర్లక్ష్యంగా ఉన్నారు.. వ్యర్థాలను ఇక్కడి నుండి తరలించి రోడ్డు ఇబ్బందులను పరిష్కరించాలని 28 వార్డు కౌన్సిలర్ ను . మున్సిపల్ అధికారులను కాలని వాసులు కోరుతున్నారు..





# శివరాజు ని పరామర్శించిన :మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి టౌన్ సిటీ టైమ్స్ ఏప్రిల్ 3**

వనపర్తి పట్టణం 28వ వార్డులో ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్న శివరాజు ని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి కలిసి ఆరోగ్యం గురించి ఆరా తీసి పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగామాజీ మంత్రి వెంట జోహెబ్ హుస్సేన్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బండ్లగూడలో భక్తి జ్వాలలు...ఘనంగా వీర హనుమాన్ విజయ యాత్ర



- **‘జై శ్రీరామ్’, ‘జై హనుమాన్’ నినాదాలతో బండ్లగూడ మారుమోగింది..**
- **భారీ సంఖ్యలో పాల్గొన్న ప్రజలు..**
- **ఇందిరానగర్ ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు..**
- **అలంకరించిన రథంపై వీర హనుమాన్ దర్శనం..**

**కీసర ఏప్రిల్ 04 (సిటీ టైమ్స్):**

మేడ్చల్ -మల్కాజ్గిరి జిల్లా కీసర సర్కిల్ పరిధిలోని బండ్లగూడలో హనుమాన్ జయంతి వేడుకలు అపూర్వంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో అట్టహాసంగా జరిగాయి. గురువారం నిర్వహించిన వీర హనుమాన్ విజయ యాత్రలో భక్తులు వేలాదిగా తరలి వచ్చి భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ‘జై శ్రీరామ్’, ‘జై హనుమాన్’ నినాదాలతో ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది. ఇందిరానగర్ ఎల్లమ్మ ఆలయంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, అనంతరం శోభాయాత్ర కోసం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై వీర హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్టించి యాత్రను ఘనంగా ప్రారంభించారు. రథంపై స్వామివారి దర్శనం భక్తులను ఆకట్టుకుంది. ఈ మహా శోభాయాత్ర ఇందిరానగర్ నుంచి ప్రారంభమై 60 గజాలు, లక్ష్మీ నగర్, వీకర్ సెక్షన్ కాలనీ మీదుగా బండ్లగూడ మెయిన్ రోడ్డుకు చేరుకుని, అక్కడి నుంచి కామున్ కాంత మార్గంగా ప్రసిద్ధ దాసాంజనేయ స్వామి దేవాలయం వరకు ఉత్సాహభరితంగా సాగింది. దారిపొడవునా మహిళలు, వృద్ధులు స్వామివారికి నీరాజనాలు అర్పిస్తూ భక్తి భావాన్ని చాటుకున్నారు. యాత్రలో హనుమాన్, నరసింహస్వామి, జాంబవంతుడి వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, డీజే సౌండ్స్, రంగురంగుల లైటింగ్ మధ్య యువత ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ యాత్రకు మరింత శోభను తీసుకువచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించడంతో వేడుకలు శాంతియుతంగా, విజయవంతంగా ముగిశాయి. భక్తి, ఉత్సాహం, ఐక్యత కలిసిన ఈ వీర హనుమాన్ విజయ యాత్ర బండ్లగూడలో ఆధ్యాత్మిక సందడిని సృష్టిస్తూ భక్తుల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచింది.



www.citytimesnews.com
సిటీటైమ్స్
GENERAL NEWS
epaper.citytimesdaily.com



## టీఆర్ఎస్.. ఆ పేరు ఇప్పుడు
# ఎవరైనా వాడుకోవచ్చు

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఫ్రీ అయిందని.. ఇప్పుడు దాన్ని ఎవరైనా వాడుకోవచ్చన్నారు. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి బిహార్ సిద్ధాంతకర్త అంటూ ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు.

**తలకు మించిన భారంగా ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు**

రాష్ట్రంలో ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు 30 నుంచి 40 శాతం ఫీజులు పెంచడం మధ్య తరగతి తల్లితండ్రులకు తలకు మించిన భారంగా మారుతోందని కవిత అన్నారు. అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న స్కూల్ యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని.. అధిక ఫీజుల వసూళ్లను కట్టడి చేయాలని కోరారు.

# అన్నామలైకు షాక్

**చెన్నై, సిటీ టైమ్స్**

సీట్ల సర్దుబాటుపై మిత్రపక్షాలతో కొనసాగుతున్న చర్చలు, రాజకీయ వ్యూహాల నడుమ తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ తన అభ్యర్థుల జాబితాను శుక్రవారం ప్రకటించింది. న్యూఢిల్లీలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయం మొత్తం 27 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను విడుదల చేయగా.. సీట్లు దక్కించుకున్నవారిలో పలువురు ప్రముఖులు ఉన్నారు. రాష్ట్రంలో తమ ఉనికిని బలోపేతం చేసుకోవాలన్న బీజేపీ ఉద్దేశాన్ని ఇది సూచిస్తోంది. బీజేపీకి అన్నాడీఎంకే 27 సీట్లను కేటాయించిన సంగతి తెలిసిందే. అయితే, తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై పేరు ఈ జాబితాలో లేకపోవడం గమనార్హం. కోయంబత్తూరు నార్త్ స్థానం కావాలని ఆయన డిమాండ్ చేయగా.. అక్కడ సిట్టింగ్ బీజేపీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్‌కు బీజేపీ మళ్లీ అవకాశం కల్పించింది. దీంతో అన్నామలైకు పోటీకి అవకాశం లేకుండా పోయింది.

కోయంబత్తూరు సీటు కోసం అన్నామలై.. బీజేపీ మహిళా మోర్చా చీఫ్ వనతి శ్రీనివాసన్ మధ్య తీవ్ర పోటీ నెలకుంది. దీనిపై తమిళనాడు బీజేపీ వ్యవహారాల ఇంఛార్జ్ కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ జోక్యం చేసుకున్నా అన్నామలై తగ్గలేదని తెలిసింది. కానీ, చివరకు వనతి శ్రీనివాసన్‌వైపే బీజేపీ అధిష్ఠానం మొగ్గుచూపింది. రామనాథపురం సీటును అన్నామలైకి ఇస్తారని భావించినా.. అక్కడ జీబీఎస్‌కే నాగేంద్రన్‌కు కేటాయించడం గమనార్హం.

కేంద్ర మంత్రి ఎల్ మురుగన్.. అవినాషి (ఎస్సీ) స్థానం నుంచి పోటీచేస్తుండగా.. తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు మైలాపూర్ టిక్కెట్ దక్కింది. గత ఎన్నికల్లో ఆమె ఇక్కడ నుంచే పోటీచేసి ఓటమి చవిచూశారు. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్ సత్తూరు నుంచి పోటీచేస్తున్నారు. తమిళనాడు ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పొత్తులో భాగంగా బీజేపీకి 27 సీట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. అవడి, మైలాపూర్, థాళ్లి, తిరువణ్ణామలై, రసిపురం, మోడుకురిచ్చి, ఉదగమండలం, అవనాషి, తిరుపూర్ (సౌత్), కోయంబత్తూరు (నార్త్), తిరువరూర్, గంధర్వకొట్టయ్, పుదుక్కొట్టై, అరంథంగి, తిరుపుత్తూరు, మనమదురై, మదురై సౌత్, సత్తూరు, రామనాథపురం, తిరుచందూర్, వాసుదేవనల్లూరు స్థానాల్లో బీజేపీ పోటీచేస్తోంది. మొత్తం 234 స్థానాలున్న తమిళనాడులో ఏప్రిల్ 23న ఒక విడతలో పోలింగ్ జరగనుంది. బెంగాల్, కేరళ, అసోం రాష్ట్రాలతో కలిసి మే 4న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడిస్తారు.

**అన్నామలైకి బిగ్ షాక్ ఇచ్చిన కమలం పార్టీ**

తమిళనాడు శాసనసభ ఎన్నికలకు గానూ భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. శుక్రవారం, కూటమిలోని మొత్తం 27 శాసనసభ స్థానాలకు బీజేపీ అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో కేంద్ర మంత్రుల నుంచి మాజీ గవర్నర్ల వరకు ప్రముఖ నాయకులు ఉన్నారు. అయితే, ఈ జాబితా పార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలైని నిరాశపరిచింది. బీజేపీ జాబితాలో అన్నామలై పేరు లేక పోవడం సంచలనంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమిళ రాజకీయాల్లో బీజేపీ రాజకీయ ఆశలను పెంచిన అన్నామలైని ఎన్నికల బరి నుంచి దూరంగా ఉంచాలన్న నిర్ణయం ఆశ్చర్యం కలిగిస్తోంది. సంస్థాగత వ్యూహం నుంచి ఎన్నికల ప్రచారం వరకు అన్నామలై పాత్ర విస్తృతంగా ఉంటుందని బీజేపీ నాయకులు చెబుతున్నారు. అయితే, ఏఐఏడీఎంకేతో ఉన్న చేదు సంబంధాలే అన్నామలై ఎన్నికల బరి నుంచి తప్పించడానికి గల కారణమని భావిస్తున్నారు.

బీజేపీ అభ్యర్థుల జాబితాలో కేంద్ర మంత్రి ఎల్. మురుగన్ నుంచి మాజీ గవర్నర్ సుందరరాజన్ వరకు పలువురి పేర్లు ఉన్నాయి. దళిత వర్గానికి రిజర్వ్ చేసిన అవినాశి అసెంబ్లీ స్థానం నుంచి పార్టీ ఎల్. మురుగన్‌ను నామినేట్ చేసింది. ఇదిలా ఉండగా, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సుందరరాజన్ మైలాపూర్ అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ టికెట్‌పై పోటీ చేయనున్నారు. కోయంబత్తూరు (ఉత్తర) స్థానం నుంచి పార్టీ వి. శ్రీనివాసన్‌ను నామినేట్ చేసింది. బీజేపీ సత్తూరు నుంచి నైనార్ నాగేంద్రన్‌ను, తిరుప్పూర్ (దక్షిణ) నుంచి ఎస్. తంగరాజ్‌ను బరిలోకి దింపింది. ఇక.. తమిళనాడులో 234 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అయితే.. ఎన్డీయే కూటమిలోని బీజేపీ సహా కీలక భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల పంపకం ఒప్పందాన్ని అన్నాడీఎంకే గతంలో ఖరారు చేసింది. బీజేపీ 27 సీట్లు ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. అంటే బీజేపీ మొత్తం 27 స్థానాల్లో మాత్రమే పోటీ చేయనుంది. తమిళనాడులో కమలాన్ని వికసింపజేయడానికి కృషి చేస్తున్న బీజేపీ, ఏఐఏడీఎంకే నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీఏ)లో భాగస్వామిగా ఉంది. ఈసారి ఆ పార్టీ కేవలం సంఖ్యాబలం మీద కాకుండా, గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్న వ్యూహాత్మకంగా ముఖ్యమైన సీట్లను దక్కించుకోవడంపై ఎక్కువ దృష్టి సారించింది. గత అసెంబ్లీ ఎన్నికలలో (2021), తమిళనాడులోని 20 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను బరిలోకి దింపిన విషయం గమనార్హం. అయితే, ఆ సమయంలో పార్టీ కేవలం నాలుగు సీట్లను మాత్రమే గెలుచుకోగా, గెలుపు శాతం నామమాత్రంగా( 20 శాతం) ఉంది. గత అసెంబ్లీ ఎన్నికలలో 20 శాతం వద్ద నిలిచిపోయిన బీజేపీ ఓట్ల వాటా, లోక్‌సభ ఎన్నికలలో 11 శాతానికి పడిపోయింది. రాష్ట్రంలో పార్టీ పునాది బలపడిందనడానికి ఇది ఒక సంకేతంగా భావించారు.



# అడ్వకేట్ కు 'ప్రశంసా పురస్కారం'

- అడ్వకేట్ జి. సాయి సౌరిష్ రావుకు ఘన సన్మానం..
- సంక్షేమానికి చేసిన కృషికి 'ప్రశంసా పురస్కారం'
- జిల్లా న్యాయమూర్తి తిరుపతి చేతుల మీదుగా అవార్డు..
- కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ న్యాయవాదులు..



**మల్కాజ్గిరి, ఏప్రిల్ 04 (సిటీ టైమ్స్):**

మల్కాజ్గిరి బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అడ్వకేట్ జి. సాయి సౌరిష్ రావు న్యాయవాదుల సంక్షేమం, అసోసియేషన్ అభివృద్ధి కోసం అంకితభావంతో చేసిన సేవలకు గుర్తింపుగా ఘన సత్కారం అందుకున్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి అదనపు జిల్లా న్యాయమూర్తి తిరుపతి ముఖ్య అతిథిగా హాజరై, ఆయనకు 'ప్రశంసా పురస్కారం'ను అందజేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, సాయి సౌరిష్ రావు ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా చూపిన బాధ్యతాయుతమైన పనితీరును ప్రశంసిస్తూ, యువ న్యాయవాదులు వృత్తి పట్ల అంకితభావంతో పనిచేస్తే ఇటువంటి గుర్తింపులు మరింత ఉత్సాహాన్నిస్తాయని పేర్కొన్నారు. సాయి సౌరిష్ రావు తన పదవిలో ఉన్నంత కాలం అసోసియేషన్ అభివృద్ధి, న్యాయవాదుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను చేపట్టి, సహచర న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఆయన కృషి వల్ల అసోసియేషన్‌లో ఐక్యత పెరిగి, న్యాయవాదుల వృత్తి పరమైన అవసరాలు తీర్చబడినట్లు సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ సత్కారం ఆయన వ్యక్తిగత విజయమే కాకుండా, యువ న్యాయవాదులలో సేవా భావాన్ని పెంపొందించే ప్రేరణగా నిలుస్తుందని పలువురు సీనియర్ న్యాయవాదులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొని సాయి సౌరిష్ రావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన భవిష్యత్తులో న్యాయవాదుల సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టి, అసోసియేషన్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## టీఎస్‌జేయు వినతి పత్రం...
# సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హామీ





- కలెక్టర్ రాజర్షి షాకు వినతి పత్రం సమర్పణ..
- అధ్యక్షుడు రాగం సుభాష్, కార్యదర్శి మేడపట్ల సాయన్న నేతృత్వం..
- అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి..
- హెల్త్ కార్డులు ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా అమలు చేయాలి..
- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, గృహాలు కేటాయించాలి

**అదిలాబాద్, ఏప్రిల్ 04 (సిటీ టైమ్స్):**

జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా హామీ ఇచ్చారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జేయు) అదిలాబాద్ జిల్లా నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రతినిధులు శుక్రవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నూతన జిల్లా అధ్యక్షుడు రాగం సుభాష్, ప్రధాన కార్యదర్శి మేడపట్ల సాయన్న, ఉపాధ్యక్షులు పసుపుల స్వామిలకు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో యూనియన్ నాయకులు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని, హెల్త్ కార్డులు అన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా చెల్లుబాటు అయ్యేలా చూడాలని కోరారు. అదేవిధంగా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులపై పెరుగుతున్న దాడులను అరికట్టేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక అటాక్స్ కమిటీ ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని కూడా సూచించారు. ఈ వినతిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ రాజర్షి షా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల్ అనిల్ కుమార్, కోశాధికారి అమృత్, ప్రచార కార్యదర్శి మిలింద్, గౌరవ అధ్యక్షుడు నరేష్ కదం, సహాయ కార్యదర్శి ఆర్క సంతోష్‌తో పాటు సభ్యులు దీపక్ ఎముర్లవార్, అనిల్ పవర్, అడ్డిగం మోహన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై కలెక్టర్ ఇచ్చిన హామీతో యూనియన్ సభ్యుల్లో ఆశావాహ వాతావరణం నెలకొంది.

# ఇద్దరు పిల్లలతో భార్య ఆత్మహత్య

- అడ్డుకున్న పోలీసులు.. పరిస్థితి ఉద్రిక్తం

**వరంగల్, సిటీ టైమ్స్**

వరంగల్ జిల్లాలో ఇద్దరు కొడుకులతో ఓ తల్లి ఆత్మహత్య చేసుకోవడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన సంగతి తెలిసిందే. పెళ్లి అయి ఇద్దరు కొడుకులు ఉన్నప్పటికీ.. రెండో పెళ్లి చేసుకున్న భర్త.. వేధింపులకు గురి చేయడంతో.. భార్య.. ఆ ఇద్దరు పిల్లలతో కలిసి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన హైదరాబాద్‌లో జరగ్గా.. భార్య కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వారి మృతదేహాలను భర్త ఇంటి ముందు గొయ్యి తీసి పూడ్చేందుకు ప్రయత్నించడం, దాన్ని పోలీసులు అడ్డుకోవడంతో ఆ గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం బోడమాణిక్యం తండాకు చెందిన ప్రవీణ్‌కు.. అదే గ్రామానికి చెందిన స్రవంతితో కొన్నేళ్ల క్రితం పెళ్లి అయింది. వీరికి కార్తీక్ (10), కౌశిక్ (8) ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ కుటుంబం.. హైదరాబాద్ మియాపూర్‌లో నివాసం ఉంటున్నారు. అయితే ప్రవీణ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నా.. అతడి బంధువుల్లో ఉండే ఓ అమ్మాయితో వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత స్రవంతిని.. ప్రవీణ్ వేధిస్తుండటంతో.. ఆమె తట్టుకోలేకపోయింది. ఒకవైపు భర్త రెండో పెళ్లి చేసుకోవడం, మరోవైపు వేధింపులకు గురి చేయడంతో తన ఇద్దరు కొడుకులతో కలిసి ఇటీవల మంగళవారం రోజున మియాపూర్‌లో ఆత్మహత్య చేసుకుంది.

ఈ విషయం తెలుసుకున్న స్రవంతి ఫ్యామిలీ హుటాహుటిన.. హైదరాబాద్ వచ్చారు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి స్రవంతి, కార్తీక్, కౌశిక్ ముగ్గురు మృతదేహాలను తమ గ్రామానికి తీసుకెళ్లారు. తమ కుమార్తె, పిల్లలు చనిపోవడానికి కారణం ప్రవీణ్ అని స్రవంతి బంధువులు, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఆ ముగ్గురు మృతదేహాలకు ప్రవీణ్ ఇంటి ముందే అంత్యక్రియలు చేసేందుకు ప్రయత్నించారు. ఇక పరిస్థితి తీవ్రంగా మారడంతో.. పోలీసులు రంగంలోకి దిగారు.

భర్త ప్రవీణ్ వేధింపుల కారణంగా స్రవంతి తన ఇద్దరు కొడుకులతో ఆత్మహత్య చేసుకోగా.. తీవ్రంగా ఆగ్రహించిన గ్రామస్తులు.. అతడి ఇంటి ముందే వారిని ఖననం చేసే ప్రయత్నాలను పోలీసులు అడ్డుకోవడంతో ఆ గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అయినప్పటికీ ఆగ్రహంలో ఉన్న గ్రామస్తులు.. పోలీసులు చెప్పినా వినకుండా ప్రవీణ్ ఇంటి ముందే పిల్లలు కార్తీక్, కౌశిక్ మృతదేహాలను పాతిపెట్టారు. అయితే స్రవంతి మృతదేహానికి మాత్రం ప్రవీణ్ పొలంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఇక ఈ ఘటన తర్వాత ఇంటి ముందు అంత్యక్రియలు ఖననం చేసిన చిన్నారుల మృతదేహాలను గురువారం రోజున పోలీసులు అక్కడి నుంచి తొలగిస్తారనే అనుమానంతో స్రవంతి బంధువులు, గ్రామస్తులు రాత్రంతా అక్కడే కాపు కాశారు. కానీ పోలీసులు అలాంటి ప్రయత్నం
చేయకపోవడంతో కాస్త శాంతించారు. మరోవైపు.. గ్రామంలో ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.



# నాణ్యత, శుభ్రతే ప్రధాన లక్ష్యం...

# చర్లపల్లిలో కొత్త రెస్టారెంట్ ప్రారంభం

- చర్లపల్లిలో కొత్తగా ప్రారంభమైన ఫుడ్ సెంటర్..
- ప్రముఖుల సమక్షంలో ప్రారంభోత్సవం..
- నాణ్యమైన, శుభ్రమైన ఆహారంపై ప్రత్యేక దృష్టి..
- స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు..
- సరసమైన ధరల్లో సేవలు అందించాలన్న లక్ష్యం..

**చర్లపల్లి, ఏప్రిల్ 04 (సిటీ టైమ్స్):**

చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో ఆహార ప్రియులకు మరో కొత్త చిరునామా అందుబాటులోకి వచ్చింది. సెంట్రల్ జైల్ సమీపంలో శ్రీరామ్ ఫుడ్స్ అండ్ రెస్టారెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితర ప్రముఖులు పాల్గొని రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, ప్రస్తుత పోటీ ప్రపంచంలో వినియోగదారుల నమ్మకాన్ని పొందాలంటే నాణ్యమైన ఆహారం, పరిశుభ్రత, సరసమైన ధరలు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. మంచి సేవలు అందిస్తేనే వ్యాపారం దీర్ఘకాలం విజయవంతంగా కొనసాగుతుందని తెలిపారు. రెస్టారెంట్ యజమాని కట్కూరి సుధా విజయ్ కుమార్ రెడ్డి స్వయంగా వ్యాపారం ప్రారంభించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రశంసనీయమని అభినందించారు. ఈ ప్రారంభోత్సవానికి పలు ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు హాజరై యజమానికి శుభాకాంక్షలు తెలిపారు. చర్లపల్లిలో ప్రారంభమైన ఈ కొత్త రెస్టారెంట్ ద్వారా స్థానికులకు నాణ్యమైన ఆహారం అందుబాటులోకి రావడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తమవుతోంది.





# మౌనంగా ఉన్నా.. కానీ ఓడిపోలేదు

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

ఆమ్ ఆద్మీ పార్టీలో మరోసారి భారీ కుదుపు జరిగింది. ఒకప్పుడు స్వాతి మాలివాల్‌పై ఏకంగా భౌతిక దాడి జరగగా... ఇప్పుడు మరో ఎంపీపై పరోక్ష దాడి జరిగింది. రాజ్యసభలో కీలక పాత్ర పోషిస్తూ... రాజ్యసభ ఉప నాయకుడి పదవిలో ఉన్న రాఘవ్ చద్దాపై వేటు వేసింది. ఊహించని రీతిలో ఆప్ అధిష్టానం పదవి నుంచి తొలగించింది. ఇకపై సభలో మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని రాజ్యసభకు లేఖ రాసింది. ఈ పరిణామంతో రాఘవ్ చద్దా ఒక్కసారిగా భారీ షాక్‌కు గురయ్యారు.తాజాగా ఈ అంశంపై ఎక్స్ వేదికగా స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. “నా మౌనాన్ని ఓటమిగా పొరపాటు పడకండి. నన్ను మౌనంగా ఉంచారు. కానీ నేను ఓడిపోలేదు” అంటూ భావోద్వేగభరితమైన వీడియో సందేశాన్ని పంచుకున్నారు.

“పార్లమెంటులో మాట్లాడే అవకాశం వచ్చినప్పుడు నేను ప్రజా సమస్యలను లేవనెత్తుతాను. ప్రజా సమస్యలను లేవనెత్తడం నేరమా? నేను ఏమైనా నేరం చేశానా?, మాట్లాడే అవకాశం ఇవ్వకూడదని ఆమ్ ఆద్మీ పార్టీ పార్లమెంటుకు చెప్పినందుకే నేను ఈ ప్రశ్న అడుగుతున్నాను. నన్ను మాట్లాడకుండా ఎవరైనా ఎందుకు ఆపాలనుకుంటారు? నేను మాట్లాడినప్పుడు ప్రజా సమస్యల గురించి, సామాన్యుడి గురించి మాట్లాడతాను.” అని రాఘవ్ చద్దా అన్నారు.



“విమానాశ్రయంలో ఖరీదైన ఆహారం అందించడం. జొమాటోబ్లింకెట్ డెలివరీ రైడర్లు ఎదుర్కొంటున్న సమస్యలు. ఆహారంలో కల్తీ సమస్యను లేవనెత్తి. టోల్ ప్లాజా దోపిడీ. బ్యాంకు ఛార్జీల దోపిడీ గురించి మాట్లాడాను. మధ్యతరగతిపై పన్నుల భారం, కంటెంట్ క్రియేటర్లు ఎందుకు సమ్మె చేస్తున్నారు. టెలికాం కంపెనీలు 12 నెలల్లో 13 సార్లు రీఛార్జ్ చేయించడం.. డేటా రోల్‌ఓవర్ ఇవ్వకపోవడం, రీఛార్జ్ అయిపోయిన తర్వాత ఇన్‌కమింగ్ కాల్స్‌ను నిలిపివేయడం వంటి సమస్యలన్నింటినీ నేను సభలో ప్రస్తావించాను.” అని రాఘవ్ చద్దా గుర్తుచేశారు.

ఈ సమస్యలను లేవనెత్తడం వల్ల సామాన్యులకు మేలు జరుగుతుందని.. అయితే దీనివల్ల ఆమ్ ఆద్మీ పార్టీకి జరిగే నష్టం ఏమిటని నిలదీశారు. నన్ను మాట్లాడకుండా ఎవరైనా ఎందుకు ఆపాలనుకుంటారు. నా గొంతును ఎందుకు నొక్కేయాలనుకుంటారు?, మీరు నాకు అపరిమితమైన ప్రేమను ఇస్తున్నారు. నేను మీ సమస్యలను ప్రస్తావించినప్పుడల్లా మీరు నాకు మద్దతు ఇస్తారు. నన్ను ప్రశంసిస్తారు. ప్రోత్సహిస్తారు. మీకు ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను. ఇలాగే నా చేయి పట్టుకుని నాకు మద్దతు ఇస్తూ ఉండండి. వదిలిపెట్టకండి. నేను మీకు చెందినవాడిని. మీ కోసమే ఉన్నాను. ఈరోజు పార్లమెంటులో మాట్లాడే నా హక్కును లాక్కుని, నా గొంతు నొక్కేసిన వారికి కూడా నేను ఒకటి చెప్పాలనుకుంటున్నాను.” అని రాఘవ్ చద్దా ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రస్తుతం రాఘవ్ చద్దా స్థానంలో అశోక్ కుమార్ మిట్టల్‌ను నియమించింది. ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో ఊహాగానాలకు దారితీసింది. అయితే ఇటీవల లిక్కర్ కేసులో కేజ్రీవాల్, మనీష్ సిసోడియా నిర్దోషులుగా విడుదలయ్యారు. ఆ సమయంలో రాఘవ్ చద్దా ఒక్క మాట కూడా బహిరంగంగా మాట్లాడలేదు. కనీసం మద్దతుగా కూడా నిలవలేదు. అంతేకాకుండా బీజేపీకి దగ్గరవుతున్నారన్న వార్తలు రావడంతో ఈ వేటు పడినట్లుగా వార్తలు వస్తున్నాయి.




# మళ్లీ అక్కడే కట్టిస్తా

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. జాతీయ రహదారి విస్తరణ పనులలో భాగంగా సంగారెడ్డిలో 20 ఏళ్ల క్రితం తొలగించిన ఓ గుడిని.. రాబోయే రోజులలో మళ్లీ అదేచోట ఏర్పాటు చేయించాలని జగ్గారెడ్డి ( తూర్పు జయప్రకాష్ రెడ్డి ) నిర్ణయించారు. గతంలో జాతీయ రహదారి విస్తరణ పనులలో భాగంగా తొలగించిన భూ లక్ష్మమ్మ గుడిని.. తిరిగి రోడ్డు పక్కనే గతంలో వున్న చోటే భవిష్యత్తులో ఏర్పాటు చేయించనున్నట్లు ఈ మేరకు ప్రకటించారు. అలాగే రహదారి విస్తరణ పనులలో భాగంగా ఉపాధి కోల్పోతున్న పండ్ల దుకాణాల వ్యాపారులు, పాన్ డబ్బాలు, టిఫిన్ సెంటర్ నిర్వాహకులకు రహదారి విస్తరణ పనులు పూర్తి కాగానే.. రహదారి పక్కనే తిరిగి వాటిని ఏర్పాటు చేయిస్తామని జగ్గారెడ్డి తెలిపారు. నష్టపోతున్నవారు ఈ విషయాన్ని గమనించుకుని.. టీపీసీసీ జనరల్ సెక్రటరీ అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, పార్టీ పట్టణ అధ్యక్షుల వద్దకు వెళ్లి మీరు వివరాలు అందించాలని సూచించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో సంగారెడ్డిలో రహదారి విస్తరణ పనులు చేపట్టారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ పనులు చేపట్టారు. అప్పుడు సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యేగా జగ్గారెడ్డి ఉన్నారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం సోషల్ మీడియా వేదికగా వీడియో విడుదల చేశారు జగ్గారెడ్డి. "20052006లో నేను ఎమ్మెల్యే, వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి. సంగారెడ్డి చౌరస్తా నుంచి పఠాన్ చెర్వు గంగారాం వరకూ రోడ్డు వెడల్పు చేయాలని నిర్ణయించారు. ఈ మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు అప్పుడు రూ.1000 కోట్లు కేటాయించారు. పనులు ప్రారంభించిన తర్వాత సంగారెడ్డి చౌరస్తాలో భూలక్ష్మమ్మ గుడి మధ్యలో ఉండేది. తప్పని సరి పరిస్థితులలో భూలక్ష్మమ్మ అమ్మవారి గుడిని అక్కడి నుంచి తీసి, సంగమేశ్వర గుడిలో పెట్టాల్సి వచ్చింది. అమ్మవారి విగ్రహాలను కూడా అక్కడే ఉంచాం.

అయితే 200506లో తొలగించిన భూలక్ష్మమ్మ విగ్రహాలు, గుడిని మళ్లీ పూర్వపు స్థానంలో ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాం. ఇప్పుడు ఆ సమయం వచ్చింది. అయితే ఇప్పుడు మళ్లీ రోడ్డు వెడల్పు అవుతోంది. రోడ్డు వెడల్పు పనులలో భాగంగా కొంతమంది పండ్ల దుకాణాలు, టిఫిన్ బండ్లు, పాన్ డబ్బాల నిర్వాహకులు ఉపాధి కోల్పోతున్నట్లు తెలిసింది. అలాంటి వారు వివరాలు అందించండి. రహదారి పనులు పూర్తి కాగానే గుడిని, పండ్ల దుకాణాలు, టిఫిన్ సెంటర్లను ఏర్పాటు చేయిస్తాం. వారికి తిరిగి ఉపాధి కల్పిస్తాం.. అని జగ్గారెడ్డి సూచించారు.

# రానున్న 3 రోజులు వర్షాలు

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

**తెలంగాణలో రానున్న 3 రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షా లు కురవనున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో వర్షం పడే అవకాశముంది. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, జనగామ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.**



# భారత్ బెదిరిస్తోంది

**ఇస్లామాబాద్, సిటీ టైమ్స్**

పహల్గామ్ దాడి జరిగి ఏడాది పూర్తవుతున్న తరుణంలో భారత్‌పాకిస్థాన్ మధ్య మాటల యుద్ధం ముదిరింది. పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి భారత్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ ఉద్రిక్తతలకు ఆజ్యం పోశారు. భారత్ తమపై దాడులకు ప్రణాళికలు రచిస్తోందని.. నిరంతరం రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ఒకవేళ భారత్ ఏదైనా దుస్సాహసానికి ఒడిగడితే.. ఊహించని రీతిలో ప్రణాళికాబద్ధమైన ప్రతిస్పందన ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

**ఖవాజా ఆసిఫ్ కవ్వింపు చర్యలు ..**

పహల్గామ్ ఘటన వార్షికోత్సవం వేళ భారత్ వైపు నుంచి ముప్పు పొంచి ఉందని ఖవాజా ఆసిఫ్ పేర్కొన్నారు. "భారత్ తమపై దాడులు చేసేందుకు సాకులు వెతుకుతోంది. మాపై జరిగే ఏ చిన్న దాడినైనా అత్యంత వేగవంతమైన, వ్యూహాత్మక ప్రతిస్పందనతో తిప్పికొడతాం. మరోసారి మాతో ఘర్షణకు దిగితే భారత్ తీవ్ర పరిణామాలు అనుభవించాల్సి ఉంటుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. అంతర్జాతీయంగా ఇరాన్ యుద్ధం నడుస్తున్న నేపథ్యంలో.. భారత్ దీనిని అవకాశంగా తీసుకుని తమ సరిహద్దుల్లో అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు.

**రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్..**

ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేయడానికి కొన్ని గంటల ముందే భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. గతంలో ఉరి దాడుల తర్వాత జరిగిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా అనంతరం జరిగిన వైమానిక దాడులు (బాలాకోట్), పహల్గామ్ ఘటన తర్వాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్' వంటి చర్యలను రాజ్‌నాథ్ గుర్తు చేశారు. పొరుగు దేశం మళ్లీ ఏదైనా తప్పు చేస్తే భారత సైన్యం ఇచ్చే సమాధానం మునుపటి కంటే భయంకరంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే పాక్ రక్షణ మంత్రి ఇలా భయాందోళనతో కూడిన ప్రకటనలు చేయడం గమనార్హం.

**సరిహద్దుల్లో హై అలర్ట్**

**పహల్గామ్ దాడి వార్షికోత్సవం**

**నేపథ్యంలో జమ్మూ కాశ్మీర్ సరిహద్దుల్లో భారత భద్రతా దళాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయి. అటు ఇరాన్ సంక్షోభం, ఇటు పాక్ మంత్రుల రెచ్చగొట్టే వ్యాఖ్యల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా వర్గాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. పాకిస్థాన్ తన అంతర్గత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి**



**కవ్వింపు చర్యలకు పాల్పడుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.**

సిటీ టైమ్స్
www.citytimesnews.com
GENERAL NEWS
epaper.citytimesdaily.com



## మోడీకి భయపడి సమోసాల గురించి మాట్లాడతావా?

**- రాఘవ్ చద్దాపై ఆప్ ధ్వజం**
**- వేటుపై బహిరంగంగా స్పందించిన ఆప్**
**- బీజేపీ పట్ల మెతక వైఖరి**

హైదరాబాద్, సిటీ టైమ్స్

ఎంపీ రాఘవ్ చద్దాపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ప్రధాని మోడీకి భయపడి.. సమోసాల ధర గురించి మాట్లాడతావా? అంటూ ఆమ్ ఆద్మీ పార్టీ మీడియా ఇన్‌చార్జ్ అనురాగ్ ధండా, పార్టీ నాయకుడు సౌరభ్ భరద్వాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యసభ ఉప నాయకుడి పదవి నుంచి రాఘవ్ చద్దా తొలగింపు తర్వాత ఆప్ బహిరంగంగా స్పందించింది. రాఘవ్ చద్దా బీజేపీ పట్ల మెతక వైఖరి అవలంబిస్తున్నారని అనురాగ్ ధండా ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన విశ్వసనీయతను శంకించారు. రాఘవ్ చద్దాను అనురాగ్ ధండా ఎద్దేవా చేస్తూ.. "మీకు సమోసాల ధర తగ్గించాలా లేక దేశాన్ని కాపాడాలా అని ప్రశ్నించారు. గుజరాత్‌లో అరెస్టు అయిన పార్టీ కార్యకర్తలకు మద్దతుగా పార్లమెంటులో ఎప్పుడైనా మాట్లాడారా? అని ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడులపై ఎందుకు ఎటువంటి నిర్దిష్ట చర్య తీసుకోలేదని నిలదీశారు.

మోడీకి భయపడుతూ.. పార్టీ పోరాటాలకు దూరంగా ఉంటున్నారని తీవ్రమైన ఆరోపణలు చేశారు. సోషల్ మీడియా, బహిరంగ వేదికలపై చద్దా పనితీరును అనురాగ్ ధండా ప్రశ్నించారు. "రాఘవ్.. నువ్వు గత కొన్నేళ్లుగా భయపడుతున్నావు. మోడీకి వ్యతిరేకంగా మాట్లాడటానికి భయపడుతున్నావు. ఎవరు భయపడతారో.. వారు దేశం కోసం ఎలా పోరాడతారు?" అని అన్నారు. పార్లమెంటులో ఒక పార్టీకి మాట్లాడటానికి లభించే పరిమిత సమయాన్ని దేశాన్ని కాపాడటానికి ఉపయోగించుకోవాలి తప్ప. విమానాశ్రయాల్లో క్యాంటీన్లలో సమోసాల ధరను తగ్గించడం." వంటి సమస్యలు కాదని వ్యంగ్యంగా అన్నారు.

"పశ్చిమ బెంగాల్‌లో ఓటు హక్కును లాగేసుకుంటున్నారు. సభలో సీఈసీకి వ్యతిరేకంగా ఒక తీర్మానం వచ్చినప్పుడు భాయ్ సాహెబ్ దానిపై సంతకం చేయడానికి నిరాకరించారు. పార్టీ సభ నుంచి వాకౌట్ చేసినప్పుడు మోడీకి హాజరును సూచించడానికి కూర్చునే ఉన్నారు. రాఘవ్.. గత కొన్ని సంవత్సరాలుగా నువ్వు భయపడుతున్నావు. దేశంలోని నిజమైన సమస్యలపై మాట్లాడటానికి భయపడుతున్నావు." అని అన్నారు.

సౌరభ్ భరద్వాజ్..

పార్లమెంటులో ఉన్న పరిమిత సమయాన్ని తీవ్రమైన సమస్యలను లేవనెత్తడానికి ఉపయోగించుకోవాలి కదా? అని సౌరభ్ భరద్వాజ్ ప్రశ్నించారు. కానీ రాఘవ్ చద్దా ఆ పాత్రలో చురుకుగా పాల్గొంటున్నట్లు ఎక్కడా కనిపించడం లేదన్నారు. పార్టీ ఎంపీలు వాకౌట్ చేసినప్పుడు కూడా చద్దా సభలోనే ఉంటారని.. అది దేనికి సంకేతం అని అడిగారు.



## మేడారంలో పూజారి కుమారుడిపై పడిన రాయి

**- డమకాలు తొలగింపు, కుడికాలికి రాడ్**
**- చిన్నారి పరిస్థితి దారుణంగా మారింది**

హైదరాబాద్, సిటీ టైమ్స్

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ అయిన మేడారం సమక్క సారలమ్మ మహా జాతర ఈ ఏడాది అంగరంగ వైభవంగా జరిగింది. కోట్లాది మంది భక్తులు.. వచ్చి గద్దెలను దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఇక మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద అభివృద్ధి పనుల కోసం.. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసి డెవలప్ చేసింది. మేడారం మహా జాతర ముగిసినప్పటికీ.. భక్తులు మాత్రం గద్దెల వద్దకు వెళ్లి దర్శనాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల మేడారంలో ఒక ప్రమాదం చోటు చేసుకుంది.

గత నెల 25వ తేదీన వనదేవతల జాతర పూజారి సిద్దబోయిన రాణా రమేష్.. మేడారం గద్దెల వద్దకు వచ్చిన భక్తులు, ప్రముఖ వ్యక్తులకు దర్శనం చేయించే పనిలో పడ్డారు. ఈ క్రమంలోనే ఆ రోజున సాయంత్రం 5 గంటలకు.. రాణా రమేష్ కుమారుడు 6 ఏళ్ల యువన్ కూడా అక్కడే ఉన్నాడు. అక్కడ నిర్మాణంలో ఉన్న రాయిపై యువన్ కూర్చోగా.. ఒక్కసారిగా కింద పడిపోయాడు. అదే సమయంలో పై నుంచి రాయి వచ్చి అతడి కాళ్లపై పడింది. దీంతో ఒక కాలు నుజ్జు నుజ్జు అయింది. మరో కాలు విరిగింది.అది గమనించిన స్థానికులు వెంటనే.. హుటాహుటిన బాలుడిని ములుగు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన తర్వాత మెరుగైన వైద్యం కోసం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి అదే రోజు పంపించారు. అప్పటి నుంచి యువన్‌కు హన్మకొండలో చికిత్స అందించారు. ఇందులో భాగంగానే డాక్టర్లు అనేక మెడికల్ టెస్ట్‌లు నిర్వహించారు. ఆ తర్వాత 2 కాళ్లకు ఆపరేషన్లు చేశారు.

**యువన్ కుడికాలు విరిగిపోవడంతో.. అతడికి ఆపరేషన్ చేసి రాడ్ వేశారు. ఇక ఎడమకాలు పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో పూర్తిగా రక్తప్రసరణ నిలిచిపోయిందని డాక్టర్లు గుర్తించారు. ఈ క్రమంలోనే చికిత్స పొందుతూ ఉండగానే.. గురువారం పరిస్థితి విషమించడంతో.. బాలుడి ఆరోగ్యాన్ని రక్షించడం కోసం అతడి ఎడమకాలును తొలగించారు. కాలి మడమ కొంచెం పై వరకు యువన్ కాలును డాక్టర్లు తీసేశారు.**




## దక్షిణాసియాలో తెలంగాణ టెక్స్‌టైల్స్ క్యాపిటల్

హైదరాబాద్, సిటీ టైమ్స్

తెలంగాణ రైజింగ్‌లో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో నిర్వహించిన ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. "ఉత్తమ వస్త్రాల రూపకల్పనలో భారత్‌కు గొప్ప చరిత్ర ఉంది. అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతోంది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా లక్ష్యం. పెట్టుబడిదారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం. టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు.. చేనేతలకు జీవితం. దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం. ప్రపంచంలోనే ఫిల్మ్ ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ మారింది. చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తాం. పర్యావరణ పరిరక్షణే మా తొలి ప్రాధాన్యం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

వస్త్ర పరిశ్రమ రంగంలో 2047 నాటికి తెలంగాణను దక్షిణాసియాలోనే గొప్ప టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. టెక్స్‌టైల్ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం నిర్దేశించుకున్న విజన్‌కు అనుగుణంగా ప్రపంచాన్ని మార్చగల వాతావరణాన్ని సృష్టించడంలో తమతో భాగస్వామ్యం కావాలని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ తో కలిసి 13వ ఏషియా టెక్స్‌టైల్ సదస్సు ను నిర్వహించింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అటెక్స్‌కాన్2026 నివేదికను విడుదల చేశారు. ఈ సదస్సులో మంత్రులు శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు అధికారులు, జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి... మంత్రులతో కలిసి సందర్శించారు.



ఈ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... "అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన గొప్ప చరిత్ర భారతదేశానికి ఉంది. శతాబ్దాలుగా కళలు, సంస్కృతి, సంప్రదాయాలు టెక్స్‌టైల్స్ రంగాన్ని పరిపూర్ణంగా తీర్చిదిద్దాయి. నిజాం కాలంలో ప్రపంచ నలుమూలల నుంచి వ్యాపారులు హైదరాబాద్ నగరానికి వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఈ విషయాన్ని గర్వంగా చెప్పగలదు. టెక్స్‌టైల్స్ మా డీఎన్‌ఏలో ఉంది" అని గుర్తు చేశారు.

"వస్త్ర పరిశ్రమలో తెలంగాణ ముందంజలో ఉండటానికి చారిత్రక కారణాలున్నాయి. దేశంలో పత్తి ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నాం. పత్తి నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా పేరుంది. టెక్స్ టైల్ తెలంగాణకు కేవలం పరిశ్రమ మాత్రమే కాదు. ప్రజల జీవనాధారం. ప్రసిద్ధి చెందిన పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరలు, వరంగల్ దుర్రీస్, నారాయణపేట చేనేత వరకు అనేకం ఇక్కడున్నాయి. తెలంగాణలో నైపుణ్యం ఉంది. మంచి సంకల్పం కూడా ఉంది. డీప్‌టెక్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్, ఎనర్జీ వంటి అనేక రంగాల్లో తెలంగాణ ముందంజలో ఉంది. వరంగల్‌లో కాకతీయ ప్రపంచ స్థాయి మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేశాం. అందులో అనేక అప్పరెల్ పార్కులున్నాయి.

మా విజన్ తెలంగాణ రైజింగ్ 2047. 2034 నాటికి ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్నది మా లక్ష్యం.

వస్త్ర పరిశ్రమకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం భూమి, విద్యుత్, నీరు వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తూ ప్రోత్సహిస్తుంది. అవసరమైన అనుమతులను వేగంగా మంజూరు చేస్తుంది. ప్రపంచ పోటీకి అనుగుణంగా విధానాలు అనుసరిస్తున్నాం. అత్యుత్తమ మానవ వనరుల బలం ఉంది.

తెలంగాణ పత్తి పొలాల నుంచి లండన్, న్యూయార్క్, పారిస్, మిలాన్, టోక్యో, దుబాయ్ ఫ్యాషన్ షోల వరకు అనేక అంశాల్లో మేం కలిసి పని చేస్తున్నాం. మీకు విజన్ ఉంటే, మేము మీకు సరైన భాగస్వాములం అవుతాం. అందరం కలిసి, ప్రపంచాన్ని మార్చగల పూర్తి టెక్స్‌టైల్ ఎకోసిస్టమ్‌ను నిర్మిద్దాం.

హైదరాబాద్ భారతదేశానికి కాకుండా, ప్రపంచానికి సినిమా నిర్మాణ కేంద్రంగా ఎదుగుతోంది. ఇటీవల Netflix ఐలైన్ స్టూడియోలను ఇక్కడ ప్రారంభించాను. టాలీవుడ్, బాలీవుడ్ ఇప్పటికే హైదరాబాద్‌ను తమ కేంద్రంగా ఉపయోగిస్తున్నాయి. ఇప్పుడు హాలీవుడ్ కూడా చేరింది. సినిమా రంగం తమ ఫ్యాషన్‌ను కూడా తెలంగాణ నుంచే అభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తాం.

పర్యావరణ పరిరక్షణ మాకు అత్యున్నత ప్రాధాన్యం. గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తాం. యువతకు ముఖ్యంగా మహిళలకు శిక్షణనిస్తాం. సంప్రదాయ ఆలోచనలతో పాటు ఆధునిక పరికరాలతో కలిపి డిజైన్, కట్టింగ్, స్టిచింగ్‌లో ఉపయోగించగలం.

ప్రపంచంలోని ప్రతి దేశం తెలంగాణలో తయారైన దుస్తులను ధరించేలా చేయాలన్నది మా సంకల్పం. తెలంగాణ ఒక రాష్ట్రం మాత్రమే కాదు. విజయవంతమైన భాగస్వాములం. అందరం కలిసి సరికొత్త భవిష్యత్తును నిర్మిద్దాం. తెలంగాణ రైజింగ్ ప్రయాణంలో భాగస్వాములు కావాలి" అని పెట్టుబడుదారులకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.





## భూ మాఫియా వేధిస్తోంది

**- ఉపముఖ్యమంత్రి ముందు**
**- కన్నీళ్లు పెట్టుకున్న సైనికుడు**
**- ఆత్మహత్యే శరణ్యం అంటూ వేదన**

పాట్నా, సిటీ టైమ్స్



బీహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా ముందు ఒక సైనికుడు కన్నీళ్లు పెట్టుకున్నాడు. భూ మాఫియా తమ కుటుంబాన్ని వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సహదేశ్ కుమార్.. భారత సైన్యంలో సైనికుడు. బీహార్‌లోని ఛప్రా నగరంలో భిఖారీ ఠాకూర్ ఆడిటోరియంలో ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నారు. వేదికపైకి సైనికుడు సహదేశ్ కుమార్ వచ్చి డిప్యూటీ సీఎం ముందు తన గోడు వెళ్లబుచ్చుకుని కన్నీటి పర్యంతం అయ్యారు. తమ కుటుంబం భూ మాఫియా కారణంగాతీవ్ర ఇబ్బందులకు గురవుతోందని.. భూ వివాదం కారణంగా తన తండ్రి మరణించారని, ఇప్పుడు తన మామ బ్రెయిన్ హెమరేజ్‌కు గురయ్యారని చెప్పాడు. తాను మాఫియాతో పోరాడలేకపోతున్నానని.. ఎంత నిస్సహాయంగా ఉన్నానంటే ఆత్మహత్య చేసుకోవాలని కూడా ఆలోచిస్తున్నానని తెలిపాడు. "నాకు నలుగురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. వాళ్లకి పెళ్లి ఎలా చేయాలి? నేను ఆత్మహత్య చేసుకుంటాను సార్?. న్యాయం జరగకపోతే అదే శరణ్యం.. మేము కోర్టుకు వెళ్లే స్థితిలో లేము. మేము పని చేయాలా లేక కోర్టుకు వెళ్లాలా? సార్?." అడిగాడు.

భావోద్వేగానికి గురవుతున్న సైనికుడిని ఉప ముఖ్యమంత్రి శాంతింపజేశారు. ఆత్మహత్య పిరికితనమని అన్నారు. "నువ్వు వెళ్లిపోతే నీ కుటుంబాన్ని ఎవరు చూసుకుంటారు? నువ్వు ఇతరులను కాపాడితే.. నీకు న్యాయం జరుగుతుంది. మనం నేరస్థులకు భయపడితే.. వారు మనపై దాడి చేస్తారని నేను అందరికీ చెబుతాను." అని అన్నారు.


అనంతరం ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా.. ఈ విషయాన్ని పరిశీలించి, భూ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగానికి కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించుకున్న వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని స్పష్టంగా తెలిపారు. అటువంటి వ్యక్తులను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలను వేగవంతం చేసి, భూమిని విడిపించాలని యంత్రాంగాన్ని ఆదేశించారు.

# 35–45 ఏళ్ల వయస్సా? కండరాలు, ఎముకల బలానికి కీలకమైన సమయం




అక్టోబర్ 22, 2024న ప్రసారమైన 'ది డాక్టర్ గాబ్రియెల్ లియోన్ షో'లో, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వోండా రైట్ వృద్ధాప్యాన్ని ఎలా నివారించాలి, ఆరోగ్యంగా ఎలా జీవించాలి అనే అంశాలపై మాట్లాడారు. ముఖ్యంగా, 35 నుండి 45 ఏళ్ల మధ్య వయస్సు కండరాలు, ఎముకల బలాన్ని పెంపొందించడానికి అత్యంత కీలకమైన కాలమని ఆమె నొక్కి చెప్పారు. ఎందుకంటే, సాధారణంగా వ్యక్తులు 30 ఏళ్ల ప్రారంభం నాటికే గరిష్ట కండర ద్రవ్యరాశి , ఎముక సాంద్రతను చేరుకుంటారు.మీ ఆరోగ్యానికి 35-45 ఏళ్ల వయస్సు ఎందుకు ముఖ్యం?

ఈ వయస్సులో (35-45 ఏళ్లు) చురుకైన ఆరోగ్య చర్యలు తీసుకోవడం వల్ల వృద్ధాప్యంలో బలం, కదలికను కాపాడుకోవచ్చని డాక్టర్ రైట్ ఉద్ఘాటించారు. శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, హార్మోన్ల మార్పులను ఎదుర్కోవడానికి, భవిష్యత్ శ్రేయస్సును నిర్ణయించే కీలకమైన జీవనశైలి ఎంపికలు చేసుకోవడానికి ఇది చాలా కీలకమైన సమయమని ఆమె అన్నారు.



"25 నుండి 45 ఏళ్ల మధ్య కాలం మీ ఆరోగ్యం విషయంలో సిద్ధంగా ఉండటానికి ఒక కీలకమైన దశాబ్దం. మనం కండరాలు, ఎముకల విషయంలో గరిష్ట స్థాయికి చేరుకుంటాం. ఇంకా మనకు హార్మోన్లు కూడా సమర్థంగా పనిచేస్తాయి. చురుకైన జీవనశైలిని కొనసాగించగలం" అని వివరించారు.

డాక్టర్ వోండా రైట్ సిఫార్సు చేసిన వ్యాయామ నియమావళి:

జోన్ 2 హార్ట్ రేట్ వద్ద బేస్ ట్రైనింగ్: వారానికి 3 నుండి 4 సార్లు, 45 నిమిషాల పాటు జోన్ 2 హార్ట్ రేట్ (మితమైన తీవ్రత) వద్ద వ్యాయామం చేయాలి.

అధిక-తీవ్రత విరామ శిక్షణ : కొద్దిసేపు అధిక తీవ్రతతో (ట్రెడ్‌మిల్, రోవర్, అసాల్ట్ బైక్, ఆల్పైన్ వంటివి) వ్యాయామం చేసి, ఆపై విశ్రాంతి తీసుకోవాలి. ఇలా వారానికి



రెండుసార్లు చేయాలి. 4 సార్లు పునరావృతం చేయాలి.

బరువులు ఎత్తడం : 4 పవర్ లిఫ్ట్‌లు, ఒక్కో దానికి 4 సెట్లు చేయాలి. 1-2 రెప్స్ ఇన్ రిజర్వ్ ఉంచుకోవాలి. అంటే, మీరు పూర్తి చేసిన తర్వాత, మీరు ఇంకా 2 రెప్స్ సరైన పద్ధతిలో చేయగలరని మీకు అనిపించాలి.

"ప్రతి వ్యాయామం డైనమిక్ వార్మప్‌తో ప్రారంభం కావాలి. మీరు చేయబోయే



వ్యాయామాన్ని బట్టి, మీరు ఉపయోగించే ప్రతి కండర సమూహాన్ని, ప్రతి కీలును వార్మప్ చేయాలి. నేను బరువులు ఎత్తడానికి ముందు ప్రతిసారీ 15 నిమిషాలు నడుస్తాను. హిప్ రొటేషన్స్, ఇంచ్‌వార్మ్స్, డీప్ స్క్వాట్స్ వంటి డైనమిక్ వార్మప్స్ చేయాలి" అని సూచించారు.



# గర్భస్రావ ప్రమాదాన్ని తగ్గించడానికి గైనకాలజిస్టుల సలహాలు





మోడల్, నటి గౌహర్ ఖాన్ తన "మానోరంజన్" అనే పాడ్‌కాస్ట్‌ను ఇటీవల ప్రారంభించారు. జూన్ 1న ప్రసారమైన ఎపిసోడ్‌లో, ఆమె తల్లిదండ్రులుగా మారిన సమయంలో అనుభవాలను పంచుకున్నారు. తమ భర్త జైద్ దర్బార్‌తో కలిసి రెండవ బిడ్డకు జన్మనివ్వనున్న గౌహర్, తమ మొదటి కుమారుడు జీహాన్ పుట్టడానికి ముందు తాను ఎదుర్కొన్న గర్భస్రావం గురించి వెల్లడించారు. ఈ బహిరంగ చర్చ ద్వారా, గౌహర్ ఖాన్ గర్భస్రావం చుట్టూ అలుముకున్న నిషిద్ధాన్ని తొలగించాల్సిన అవసరాన్ని మాత్రమే కాకుండా, దీనిపై అవగాహన, మద్దతు ప్రాముఖ్యతను కూడా నొక్కి చెప్పారు. గర్భస్రావం అనేది చాలా మంది మహిళలకు సర్వసాధారణమైన అనుభవమని పేర్కొన్నారు. దీనిని గుర్తించడం ద్వారా, గర్భస్రావం బాధిత మహిళలకు మరింత సహాయకారిగా, అర్థం చేసుకునే వాతావరణాన్ని సృష్టించడానికి కృషి చేయవచ్చని వారు తెలిపారు.

మొదటి మూడు నెలల్లో గర్భస్రావం సాధారణమే

థానేలోని జూపిటర్ హాస్పిటల్‌లో కన్సల్టెంట్, ప్రసూతి వైద్యురాలు, గైనకాలజిస్ట్ అయిన డాక్టర్ సంగీత గాంధీ మాట్లాడుతూ, "మొదటి మూడు నెలల్లో జరిగే గర్భస్రావాలు చాలా మంది అనుకున్నదానికంటే సాధారణంగా ఉంటాయి. నమోదైన గర్భాలలో సుమారు 10 నుంచి 20 శాతం వరకు ఇలా జరుగుతాయి" అని చెప్పారు.

థానేలోని కిమ్స్ హాస్పిటల్స్‌లో కన్సల్టెంట్, ప్రసూతి వైద్యురాలు, గైనకాలజిస్ట్ అయిన డాక్టర్ సుజాత రాథోడ్ కూడా దీనిని అంగీకరించారు. "మొదటి త్రైమాసికంలో గర్భస్రావం అనేది చాలా మంది మహిళలు అనుభవించే వాస్తవం. గర్భధారణ సమయంలో గర్భస్రావం సాధారణమే అయినప్పటికీ, దాని చుట్టూ నిశ్శబ్దం, అపోహలు అలుముకొని ఉన్నాయి" అని ఆమె అన్నారు.

గర్భస్రావానికి కారణాలు

డాక్టర్ రాథోడ్ మాట్లాడుతూ, "గర్భధారణ సమయంలో మొదటి మూడు నెలలు (ఫస్ట్ ట్రైమెస్టర్) వేగవంతమైన మార్పులు, అభివృద్ధి జరిగే స్వల్ప కాలం. అందువల్లనే ఈ సమయంలో గర్భస్రావం సంభవించవచ్చు. క్రోమోజోమ్‌ల అసాధారణతలు, హార్మోన్ల స్థాయిలు లేదా గతంలో ఉన్న ఇతర వైద్య సమస్యలు గర్భస్రావానికి కారణాలు కావచ్చు. గర్భస్రావాన్ని నివారించినా, నివారించకపోయినా, మహిళలు కొన్ని గర్భధారణ భద్రతా చర్యలను పాటించడం సాధ్యమే" అని చెప్పారు.

డాక్టర్ గాంధీ కూడా దీనికి తోడుగా, "అత్యంత సాధారణ కారణం క్రోమోజోమ్‌ల అసాధారణతలు. ఇవి ఫలదీకరణ సమయంలో సంభవించే యాదృచ్ఛిక జన్యు లోపాలు. ఇవి సాధారణంగా ఎవరి నియంత్రణలో ఉండవు. తల్లి ఆరోగ్యం, జీవనశైలి లేదా చర్యలకు ఇవి ప్రతిబింబం కావు" అని వివరించారు.

జీవనశైలి మార్పులు, ఆరోగ్య పరిస్థితుల నిర్వహణ

అయితే, ఆరోగ్యకరమైన ప్రారంభ గర్భధారణకు మద్దతు ఇవ్వగల అనేక అంశాలు మన అదుపులో ఉన్నాయి. డాక్టర్ గాంధీ మాట్లాడుతూ, "సమతుల్య ఆహారం, తగినంత ద్రవాలు తీసుకోవడం (హైడ్రేషన్), సరైన విశ్రాంతి చాలా ముఖ్యం. పొగాకు, ఆల్కహాల్, వినోదకరమైన మాదక ద్రవ్యాలు, అధిక కెఫిన్‌ను నివారించడం వల్ల ప్రమాదం తగ్గుతుంది. మధుమేహం, థైరాయిడ్ లోపాలు లేదా

ఆటోఇమ్యూన్ వ్యాధులు వంటి అంతర్లీన సమస్యలు ఉన్న

మహిళలు గర్భధారణకు

ముందు కౌన్సెలింగ్ తీసుకోవాలి. గర్భధారణకు ముందు, ఆ తర్వాత ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి వారి ఆరోగ్య సంరక్షణ ప్రదాతతో సన్నిహితంగా పని చేయాలి" అని సలహా ఇచ్చారు.

డాక్టర్ రాథోడ్ మాట్లాడుతూ, మహిళలు ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం, దీర్ఘకాలిక వ్యాధులకు తగిన చికిత్స తీసుకోవడం, హానికరమైన పదార్థాలను నివారించడం,

గర్భం దాల్చిన వెంటనే త్వరిత వైద్య సంరక్షణ తీసుకోవడం వంటివి

చేయవచ్చని తెలిపారు. "మహిళల శారీరక శ్రేయస్సుతో పాటు

, ఈ ప్రక్రియలను తెలియజేయడానికి మహిళల్లో భావోద్వేగ

శ్రేయస్సును కూడా మనం నెలకొల్పాలి. గర్భస్రావం సంభవించినప్పుడు

దాని ప్రారంభ

సంకేతాలను ఎప్పుడు, ఎలా వెల్లడించాలి.

సిటీటైమ్స్
www.citytimesnews.com
సినిమా ముచ్చట్లు
epaper.citytimesdaily.com

# కమర్షియల్ చిత్రాల్లో ఇలాంటి సందేశం అరుదు



నవీన్ చంద్ర ప్రధాన పాత్రలో రానున్న 'నీలిర' . సోమీధరన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఏప్రిల్ 3న ప్రేక్షకుల ముందుకురానుంది. 1988 నాటి శ్రీలంక అంతర్యుద్ధం నేపథ్యంలో జరిగిన కథగా ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా నటుడు రానా మాట్లాడుతూ.. యుద్ధం నేపథ్యం చిత్రాల్లో మానవీయ కోణాన్ని ఆవిష్కరించడం అరుదైన విషయమని అన్నారు. "నీలిర' చిత్రం ప్రత్యేకత ఏమిటంటే.. ఇందులో చాలామంది వ్యక్తులు, చాలా కోణాలు ఉన్నాయి. కానీ కథాంశం మాత్రం మానవత్వం చుట్టూ తిరుగుతుంది. యుద్ధంలో ఎవరూ విజేతలు కాలేరని, ప్రతిఒక్కరూ ఏదో ఒకటి కోల్పోతారనే సత్యాన్ని ఈ సినిమా చెబుతుంది. కమర్షియల్ సినిమాల్లో ఇలాంటి సందేశం ఇవ్వడం చాలా అరుదు. ఒక యుద్ధం గురించి సినిమా తీస్తున్నామంటే సాధారణంగా తుపాకీ కాల్పులు, పోరాటాలు ఉంటాయని ఊహిస్తాం. కానీ యుద్ధం వల్ల కలిగే గాయం, వాస్తవ పరిస్థితులను లోతుగా పరిశీలిస్తే తప్ప అర్థం చేసుకోలేం. ఒక్క బుల్లెట్ కూడా పేల్చకుండా, కేవలం ఒక సామాన్య కుటుంబం పడే వేదనతో యుద్ధ వాతావరణాన్ని, ఉత్కంఠను చివరివరకు కొనసాగించడం అంత సులభం కాదు. దర్శకుడు ఇలాంటి కథను ఎంచుకోవడం చాలా గొప్ప విషయం" అని రానా అన్నారు.

# ఖుష్బూకి విజయ్ సోదరుడిలాంటివాడు.. అందుకే అతన్ని విమర్శించను : సుందర్



తమిళనాడు రాజకీయాలు రోజురోజుకు రసవత్తరంగా మారుతున్నాయి. ప్రముఖ దర్శకుడు, నటుడు సుందర్ సి ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నట్లు ప్రకటించారు. ఆయన మదురై సెంట్రల్ నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సుందర్ సి తన రాజకీయ ప్రయాణంపై స్పందించారు. మూడు దశాబ్దాలుగా సినీ పరిశ్రమలో కొనసాగుతున్న తాను, ఇప్పుడు ప్రజాసేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. గెలిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అయితే ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ రెండు పెద్ద పార్టీల మధ్యే ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. తమ పోటీ తీవ్రంగా ఉండబోతోందని చెప్పారు.ఇక నటుడు విజయ్ స్థాపించిన పార్టీపై ప్రశ్నించగా సుందర్ సి ఆసక్తికరంగా స్పందించారు. రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినప్పటికీ విజయ్ విషయంలో తాను అలాంటి వ్యాఖ్యలు చేయనని స్పష్టం చేశారు. విజయ్ మా కుటుంబ సభ్యుడిలాంటి వాడు. నా భార్య ఖుష్బూ ఆయన్ని తమ్ముడిగా భావిస్తుంది. ఆయన కూడా ఆమెను అక్కగా పిలుస్తాడు. మా మధ్య ఉన్న ఈ బంధం వల్ల ఆయనను గానీ, ఆయన పార్టీని గానీ నేను విమర్శించను అని తెలిపారు.

మదురై అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించిన ఆయన, గెలిస్తే ప్రతి నెలా కొంతకాలం నియోజకవర్గంలోనే ఉండి ప్రజలతో మమేకమవుతానన్నారు. ఎన్నికల ఫలితాలే తన తదుపరి రాజకీయ అడుగులను నిర్ణయిస్తాయని చెప్పారు. మరోవైపు విజయ్ తన పార్టీతో ప్రజల్లోకి వెళ్లేందుకు భారీ సభలు నిర్వహిస్తున్నాడు. అయితే ర్యాలీలకు అనుమతుల సమస్యలు, కొన్ని ఘటనలు, కేసులు వంటి ఇబ్బందులు కూడా ఎదురవుతున్నాయి. మొత్తానికి తమిళనాడు రాజకీయాల్లో సినీ ప్రముఖుల ఎంట్రీతో పోటీ మరింత ఉత్కంఠగా మారింది. రాబోయే ఎన్నికల్లో ఇది ఎంతవరకు ప్రభావం చూపుతుందో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# లవ్ ఫెయిల్యూర్ వెనుక ఉన్న స్టోరీ బయటపెట్టిన అడివి శేష్.. కెనడా వరకు సాగిన ప్రేమ!



ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అడివి శేష్ ప్రస్తుతం వరుస విజయాలతో దూసుకుపోతున్నాడు. విభిన్న కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ సక్సెస్ ఫుల్ హీరోగా నిలిచిన శేష్, ఇప్పుడు తన కొత్త సినిమా డెకాయిట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదలకు సిద్ధమవుతుండగా, ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నాడు. ఇటీవల ఒక టీవీ షోలో పాల్గొన్న శేష్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. ముఖ్యంగా తన ప్రేమ కథ గురించి చెప్పడంతో అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

శేష్ మాట్లాడుతూ, అమెరికాలో చదువుకుంటున్న సమయంలోనే ఒక అమ్మాయితో ప్రేమలో పడ్డానని తెలిపాడు. ఆ సమయంలో సినిమాలపై ఆసక్తితో అక్కడే ప్రయత్నాలు మొదలుపెట్టినప్పటికీ, తన వ్యక్తిగత జీవితం కూడా అదే సమయంలో కొత్త మలుపు తిరిగిందని చెప్పాడు. ప్రేమలో మునిగిపోయిన తాను ఆ అమ్మాయి కోసం దేశం దాటి కెనడా వరకు వెళ్లినట్లు వెల్లడించాడు. అయితే ఆ ప్రేమ కథ ఎక్కువ కాలం నిలవలేదని, చివరికి లవ్ ఫెయిల్యూర్‌తో ముగిసిందని శేష్ చెప్పుకొచ్చాడు. ఆ అనుభవం తన జీవితంలో ఒక పెద్ద పాఠం నేర్పిందని, తరువాత కెరీర్‌పై పూర్తిగా దృష్టి పెట్టడానికి అదే కారణమైందని వెల్లడించాడు.

ఇండస్ట్రీలో ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకుండా అడుగుపెట్టిన శేష్, తన కృషితోనే ఒక్కో మెట్టు ఎక్కుతూ ఈ స్థాయికి చేరుకున్నాడు. ఇప్పుడు అతను చేసే ప్రతి సినిమా కూడా ప్రత్యేకతతో ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో, డెకాయిట్ పై కూడా మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ ప్రేమకథ బయటకు రావడంతో అభిమానులు శేష్ వ్యక్తిగత జీవితంపై మరింత ఆసక్తి చూపుతున్నారు. కెరీర్‌లో విజయాలు సాధించిన అతని జీవితం వెనుక ఇలాంటి భావోద్వేగ కథ ఉందని తెలుసుకుని సోషల్ మీడియాలో నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.

# 1950 నాటి రాజకీయం






మలయాళ అగ్ర హీరో టొవినో థామస్, కయాదు లోహర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పీరియాడిక్ చిత్రం 'పళ్లిచట్టంబి' ఈ నెల 10న పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. డిజో జోస్ ఆంటోని దర్శకుడు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో చిత్ర నాయకానాయికలు టొవినో థామస్, కయాదు లోహర్ విలేకరులతో మాట్లాడారు. సోషియో పొలిటికల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా తెరకెక్కిందని, 1950 నాటి పరిస్థితులకు అద్దం పడుతుందని తెలిపారు. టొవినో థామస్ మాట్లాడుతూ '1950 దశకంలో కేరళలో జరిగిన సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఫిక్షనల్ స్టోరీ ఇది. అప్పటి సామాజిక పరిస్థితులను చూపించాం. అన్నింటికంటే మానవత్వం ముఖ్యమనే అంశాన్ని ఈ సినిమాలో ఆవిష్కరించాం. ఎక్కడా మతాల ప్రస్తావన ఉండదు. చర్చి నేపథ్యంలో కొన్ని సన్నివేశాలుంటాయి' అన్నారు. ఈ సినిమాలో తాను రెబెకా అనే ఇంటెలెక్చువల్ మహిళ పాత్రలో కనిపిస్తానని, తన కెరీర్‌ను మరింత ముందుకు తీసుకెళ్లే క్యారెక్టర్ ఇదని తెలిపింది. తన పాత్రలో సహజత్వం కోసం ఎంతో పరిశోధన చేశానని, కొన్ని పుస్తకాలను కూడా చదివానని పేర్కొన్నది.

# వంద దేవుళ్లు సాంగ్.. విజయ్ ఆంటోనీ, స్వాసిక 'ఇది కలనో' సాంగ్

తెలుగు, తమిళ ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ విజయ్ ఆంటోని. ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ శశి డైరెక్షన్‌లో నటించిన చిత్రం బిచ్చగాడు. ఈ మూవీ బాక్సాఫీస్ ఏ రేంజ్‌లో షేక్ చేసిందో తెలిసిందే. తాజాగా ఈ ఇద్దరి కాంబోలో వస్తోన్న మూవీ 'వంద దేవుళ్లు'. ఈ చిత్రం నుంచి ఇది కలనో సాంగ్ విడుదల చేశారు. భాష్య శ్రీ రాసిన ఈ పాటను శిభి శ్రీనివాసన్, శిరీష భాగవతుల వాయిస్ అందరినీ ఇంప్రెస్ చేసేలా సాగుతుంది. ఇప్పటికే విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. రైతు సమస్యల చుట్టూ తిరిగే బలమైన సామాజిక సందేశంతో వస్తోన్న ఈ మూవీలో స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి భాష్య శ్రీ డైలాగ్ రైటర్‌గా కూడా పనిచేస్తున్నాడు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీని వేసవిగా కానుకగా ప్రేక్షకుల ముందుకు



Printed, Published and Owned by B.PRAMOD KUMAR, B258, Phase1, Vanasthalipuram, Hyderabad 70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana. Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor : N.Ramakrishna Reddy, email: citytimestd@gmail.com, RNI: APTEL/2001/5896